18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శుక్రవారం | 13 డిసెంబర్ 2024 | పేజీలు 11

## ఉచిత పంటల బీమాకు మంగళం?

- నాటి ప్రభుత్వం కట్టింది.. నేటి ప్రభుత్వానికేమైంది
- రైతు ప్రీమియం కట్టాల్సిందే బీమా చేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు
- టార్గెట్ పూర్తికి సిబ్బందికి హుకుం
- బీమా కట్టమంటున్న కర్షకులు
- ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం

వివరాలు 4లో



## నేడు స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

- విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుండి తరలి వెళ్లిన రైతులు, ప్రముఖులు
- వాహనాలను లాంఛనంగా ప్రారంభించిన జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** వికసిత్ భారత్ 2047లో భాగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చి దిద్దాలనే లక్ష్యంతో రూపొందించిన స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 13న విజయవాడలో ఆవిష్కరించనున్న నేపథ్యంలో రైతులు,ప్రముఖులతో కూడి బయలు దేరే వాహనాలను గురువారం జిల్లా సచివాలయం నుండి ఇన్‌చార్జ్ కలెక్టర్ జి.విద్యాధరి లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ జి.విద్యాధరి మాట్లాడుతూ ఈనెల 13న శుక్రవారం ఉదయం 9 గంటలకు విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుండి బయల్దేరిన రైతులు, ప్రముఖులు కోసం 6 బస్సులను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ,డ్వామా పీడీ రవి కుమార్, డిఎల్‌డిఓ రవికుమార్, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






## రేణిగుంట ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ రాజేష్ సస్పెన్షన్

5లో

## తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో భారీ వర్షం

నేడు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలకు సెలవు



రూరల్ ప్రాంతాలలో కోతలకు గురైన రోడ్లు, కల్వర్టులు



**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలో, రూరల్ ప్రాంతాల్లో గురువారం ఉదయం నుండి తుఫాన్ ప్రభావంతో ఎడ తెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షం కురవడంతో నగరంలోని పలు కూడలిలో వర్షం నీరు నిల్వ ఉండడంతో వాహన దారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ముఖ్యంగా ఉదయం నుండి వర్షం రావడంతో లక్ష్మీపురం సర్కిల్, చాపల మార్కెట్, బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతా లలో రోడు పైన సముద్రంలా నీరు రావడంతో రాక పోకలకు చాలా అంతరాయం కలిగింది. అదేవిధంగా డియర్ మహల్, రాయల్ చెరువు రోడ్డు, వెస్ట్ చర్చ్ అండర్ బ్రిడ్జిల వద్ద ఎక్కువ నీరు నిలువ ఉండడంతో వాహన దారుల రాక పోకలను

మిగతా 2లో

### లోక్‌అదాలత్ పేరుతో
## పోలీసుల/అబ్కారీ పోలీసుల దోపిడీ

### కక్షిదారుల నుంచి దండకాలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** కేసుల రాజీ కోసం నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లు పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ప్రభు త్వం చిన్న చిన్న కేసులతో అవస్థలు పడుతున్న వారికి ఉపశ



మనం కల్పించాలన్న లక్ష్యంతో పాటు న్యాయస్థానాలపై పని భారం తగ్గించడం లక్ష్యంగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తారు. కేసులలో పోలీసులు/ అబ్కారీ పోలీసులు పెట్టిన గొలుసు దుకా ణాల కేసులు ఘర్షణల ఇతర కేసులు ఇరు వర్గాల కక్షిదారులను పరస్పరం అంగీకారంతో రాజీ కుదిర్చి కేసుల నుంచి విముక్తి కల్పిస్తుంటారు. గొలుసు దుకాణాల కేసులు రెండు శాఖల పోలీ సులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. చలానాలు ముందుగా కట్టాలంటూ గత కొన్ని రోజులుగా మందస్తు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే సమయంలో కక్షిదారులకు పోలీసులు, అభ్కారీ శాఖ పోలీ సులు ఇరువురు పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోప ణలు వినిపిస్తున్నాయి. లోక్‌అదాలత్‌కు అంగీకరించిన వారికి సమాచారం ఇవ్వడం ముందుగానే చెల్లించాల్సిన అపరాధ రుసుం కట్టించుకునే క్రమంలో పెద్దఎత్తున అవకతవకలు జరు గుతున్నట్లు ఆరోపణలువస్తున్నాయి. ప్రధానంగా గ్రామాల్లో చిన్న తగాదాలు, కోడిపందాలు వేస్తూ పట్టుబడిన

మిగతా 2లో

## తూఫాన్ వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి

### జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు ప్రయాణాలు చేయవద్దని, కాజ్వేలపై నీరు ప్రవహిస్తున్న సందర్భంలో పొరపాటున కూడా దాటరాదనీ, జిల్లా యంత్రాంగం అంతా కూడా ఎటువంటి ఆస్తి నష్టం, మానవ, పశుప్రాణ నష్టం జరగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టి ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం లో, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసమని, సంబంధిత అధి కారులు వారి పరిధిలోని గ్రామాలలో, పట్టణాల లో పర్యటించి డ్రైనేజీ కాలువలు ఎక్కడైనా బ్లాక్ అయిన వాటిని క్లియర్ చేయాలని, ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందని, కోస్తా తీర ప్రాంతాల్లో మత్స్యకారులను అప్రమత్తం చేసి సముద్రంలోకి వేటకు వెళ్లకుండా పర్యవేక్షిస్తున్నా మన్నారు. అధికారులందరూ 24/7 వారి ప్రధానకార్యస్థానంలో అందుబాటులో ఉండాల న్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు

మిగతా 2లో

## తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో భారీ వర్షం

(మొదటిపేజీ తరువాయి)

నిలిపి వేయడం జరిగింది. కొన్నిచోట్ల భూ డ్రైనేజీ కాలవలు ఉబ్బి పైకి రావడంతో రోడ్డుపై నడవడానికి కూడా చాలా ఇబ్బం దులు గురైనారు. తిరుపతి రూరల్ ప్రాంతంలో చిగురు వాడ, తనపల్లి, నక్కల కాలనీలలో ఎక్కువ వర్షం కురవ డంతో రోడ్లు కల్వర్టులు కోతలకు గురయినాయి. నగర పాలక సంస్థ వారు తుఫాన్ వల్ల కురుస్తున్న వర్షానికి నగరంలో 17 ప్రాంతాలలో పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే పోలీస్ సిబ్బంది జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు తుఫాను ప్రభావాన్ని పరివేక్షించారు. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షానికి విద్యార్థులకు శుక్రవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలకు సెలవును ప్రభుత్వం ప్రకటించింది.



## చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహావిష్కరణ

**గుడిపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో లయన్స్ క్లబ్ అఫ్ కుప్పం వారియర్స్ వారి సౌజన్యంతో సరస్వతి విగ్రహాన్ని ప్రాణ ప్రతిష్ట, విద్యార్థులు సమావేశ వేదికను చేయించారు. లయన్స్‌క్లబ్ అడ్వైజర్ డా.ఎ.మహేష్ మాట్లాడుతూ కస్తూరిబా పాఠశాలలో గతంలో సరస్వతి విగ్రహానికి పనులు చేపట్టి అవి మధ్యలోనే ఆగిపోవడం జరిగిందని అదేవిదంగా విద్యార్థులకు సమావేశ వేదిక కావాలని విన్నవించగా, క్లబ్ సభ్యుల్లో ఒకరైన సుబ్రహ్మణ్యం, ఇతర సభ్యులు ముందుకువచ్చి సరస్వతి విగ్రహంతో పాటు మండపాన్ని కూడా ఏర్పాటు చేసి ఈ రోజు విద్యార్థులకు సాక్షాత్తు చదువుల తల్లి సరస్వతి దేవిని ప్రాణ ప్రతిష్ట చేసి వారికి అందించామని ఆయన తెలిపారు. లయన్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తూనే ఉంటామని అటువంటి దానిలో తన పాత్ర కూడా ఉండాలనే ఉద్దేశంతో పాఠశాల సిబ్బంది విద్యార్థులు అడిగిన వెంటనే సాక్షాత్తు సరస్వతి దేవి అనుగ్రహాన్ని, విద్యార్థులు సమావేశ వేదికను విద్యార్థులకు అందించాలనే సంకల్పముతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, ఈ రోజున ఆ సరస్వతి దేవి కృపతో దిగ్విజయంగా ఆమెను కస్తూరిబా పాఠశాలలో ప్రాణప్రతిష్ట చేయించామన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కూడా ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి సెంథిల్, కోశాధికారి చరణ్ , డైరెక్టర్ పీజీ సెల్వం, పిఆర్ఓ లెనిన్, పాఠశాల ఎస్ఓ మాధవి, ఉపాధ్యాయనిలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.




## జోరువానలోనూ రెవెన్యూ సదస్సులు

**డక్కిలి, మేజర్‌న్యూస్:** జోరువానల్లోనూ మండలంలోని పలుగోడు, సూరాయపాళెం గ్రామాల్లో అధికారులు గురువారం రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామస్తులు పలు సమస్యలపై అధికారులకు అర్జీలు అందచేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు రెవిన్యూ సదస్సులు ద్వారా పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. రెవిన్యూ సదస్సుల్లో ఎక్కువగా భూ సమస్యలపై అర్జీలు వస్తున్నట్లు వివరించారు. వీటిలో కొన్నింటిని అక్కడి కక్కడే పరిష్కరించగా పరిష్కారం కాని వాటిని జిల్లా అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రాజగోపాల్, రంగినేని రాజా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## చంద్రగిరి ముఖ ద్వారంలో మురుగునీరు

### ఎమ్మెల్యే నాని పలుమార్లు ఆదేశించిన ఆచరణ శూన్యం

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి పట్టణానికి ముఖద్వారం అయినా వెంకటం పేట గ్రామం వద్ద తేలికపాటి వర్షానికి కూడా రోడ్డుపై మురుగునీరు నిలవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. చంద్రగిరికి ముఖద్వారం కావడంతో ఆ మార్గంలో తరచూ వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. తేలికపాటి వర్షాలకు కూడా సమీప కాలవలోని మురుగు నీరురోడ్డు మీదకు రావడంతో ద్విచక్ర వాహనాలు నడిపేందుకు ఆటంకం కలుగుతుంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనం నడుపుతున్న మహిళలు పలుమార్లు మురుగు నీటిలో పడి గాయాలవుతున్నాయి. మురుగు నీటితో వెంకటంపేట గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సమస్యను త్వరితగతిన పూర్తి చేయాలని, మురుగు నీటిని తొలగించేం దుకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని అధి కారులను ఆదేశించారు. ప్రస్తుతం కురు స్తున్న భారీ వర్షాలకు రోడ్లు నదులను తలపిస్తున్నాయి. వెంకటంపేట గ్రామస్తుల గృహాలలోకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వెంకటం పేట గ్రామస్తులతో పాటు వాహన దారులు కోరుతున్నారు.



## తుఫాన్ వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం అందించి అప్రమత్తం చేయాలని సూచించారు. కోస్తా తీర ప్రాంతాలైన గూడూరు డివిజన్ కోట, చిల్లకూరు, వాకాడు మండలాలు, సూళ్లూరుపేట డివిజన్ నందు తడ తదితర మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా జెసి అధికారులకు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. చెరువులు, కాలువల వెంబడి అధికారులు పర్యటించి కరకట్టలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తుంటే దాటడానికి అనుమతించరాదని ఇరువైపుల రోపులను కట్టి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పోలీస్, గ్రామ సచివాలయసిబ్బంది,ఆర్ అండ్ బి పంచాయితీ రాజ్ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి విపత్తును అయినా ఎదుర్కునేందుకు అన్ని విధాల సంసిద్ధంగా ఉన్నామని, భారీ వర్షాల నేపథ్యం లో తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో మండల, డివిజన్, జిల్లా స్థాయిలో సైక్లోన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనదని ఏదైనా సహాయం, సమాచారం కోసం కింది నెంబర్లను సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ తుఫాను కంట్రోల్ రూమ్ నెంబర్: 0877-2236007, గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం-కంట్రోల్ రూమ్ నెం: 9849904062, సూళ్లూరుపేట ఆర్‌డిఓ కార్యాలయం-కంట్రోల్ రూమ్ 9441984020, తిరుపతి ఆర్‌డిఓ కార్యాలయం-కంట్రోల్ రూమ్ 7032157040, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం-కంట్రోల్ రూమ్ 6281156474.

## లోక్‌అదాలత్ పేరుతో పోలీసుల/అబ్కారీ పోలీసుల దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

వాళ్లు, గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నవాళ్లు, ఇతర ప్రమాదాల్లో రాజీకి అవ కాశం ఉన్న అన్ని కేసులు విషయంలోనూ కక్షిదారుల నుంచి ఈ విధంగా వసూళ్లు చేస్తున్నారు. ప్రధానంగా గొలుసు దుకాణాలు నిర్వహిస్తూ ఇటు పోలీసులు, అటుఅబ్కారీ శాఖ పోలీసులు పట్టు కున్న కేసులే ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి కేసుల్లో ఇతర రాష్ట్రా ల మద్యం పట్టుబడితే పట్టుకున్న మద్యం సీసాల ధరకు ఐదు రెట్లు, రాష్ట్రంలో తయారైన మద్యం అమ్ముతూ పట్టుబడితే మద్యంసీసాల ధరకు మూడు రెట్లు అపరాధ రుసుం కట్టించుకుంటారని తెల్సింది. అయితే ఇక్కడే పోలీసులు/అబ్కారీ పోలీసులు ముద్దాయిలను తమచాకచక్యం ప్రదర్శిస్తూ ముందుగానే వాళ్ల నుంచి అపరాద రుసుం తెప్పించుకుంటూ పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారని కక్షిదారులు ఆవేదన చెందుతున్నారు. ఖజానలో అపరాద రుసుం చలాన రూపంలో చెల్లించాలంటూ ముందుగా వారి నుంచి వసూళ్లు చేస్తున్నారు. అదేమంటే కొందరు అపరాద రుసుం కట్టలేని వాళ్లకు తాము చెల్లించాల్సి ఉంటుందని కొందరు సమర్థించుకుంటున్నట్లు తెల్సింది. ఏది ఏమైనా వీరు చేస్తున్న దండకాలతో ముద్దాయిలు బెంబేలెత్తి పోతున్నారు. ఇకనైనా లోక్‌అదాలత్ పేరుతో వీరు సాగిస్తున్న దందాకు ఉన్నతాధికారులు న్యాయాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుని వారికి ఉపశమనం కల్పించాల్సి ఉంది.

## జిల్లాలో నేడు నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 556 అర్జీలు

### జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** చిన్న, సన్నకారు రైతుల భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదికగా ప్రభుత్వం రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, జిల్లా వ్యాప్తంగా జరుగుచున్న గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6 నుండి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి గురవారం తిరుపతి జిల్లాలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో రెవెన్యూ, భూ సమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవడానికి అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని ఈ అవకాశాన్ని సదరు గ్రామాలలోని బడుగు బలహీన వర్గాల ప్రజలు, నిరక్ష్యరాసులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు జిల్లావ్యాప్తంగా నేడు 51 గ్రామ సభలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో నేడు జరిగిన రెవెన్యూ సదస్సులో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల రెవెన్యూ, సంబందిత అధికారులు పాల్గొని. విజయవంతంగా రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన వివిధ సమస్యలతో కూడిన దరఖాస్తులు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చిన్న చిన్న సమస్యలు ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. తిరుపతి జిల్లాలో మొదటి రోజు నుండి నేటి వరకు జిల్లావ్యాప్తంగా 5127 అర్జీలు అందాయని అందులో నేడు 556 అర్జీలు వచ్చాయని అందులో ల్యాండ్ గ్రాబింగ్ పై -5, రీ సర్వే పై - 7, ఫామ్ 22 ఏ పై -2, హౌస్ సైట్స్ పై 152, ఆర్ ఓ ఆర్ పై -248, అసైన్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్స్ పై -48,క్యాస్ట్ వెరిఫికేషన్ - 4, ఆక్రమణకు గురి అయిన ప్రభుత్వ భూముల పై -12, దారి సమస్యలు -9, ఇతర విషయాల సంబంధించి - 61అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈరోజు వచ్చిన అర్జీలలో 5 అర్జీల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడం జరిగిందని మిగిలిన అర్జీల సమస్యలను కాల పరిమితి లోపల సంబందిత అధికారులు పరిష్కరిస్తారని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు.



## నీవా నదిని పరిశీలించిన ఎమ్మెల్యే

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** నీవా నదిలో నీటి ప్రవాహ పరిస్థితిని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పరిశీలించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే నగర పాలక అధికారులతో కలిసి తేనబండ, లిల్లీబ్రిడ్జి ప్రాంతాల్లో పర్యటించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా గురువారం ఉదయం నుంచి భారీగా వర్షం కురుస్తోంది. ఈ పరిస్థితుల్లో నీవా నదిలో నీటి ప్రవాహం మొదలవడంతో పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయడంపై ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. తేనెబండ వద్ద నీవానదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు.





నదిలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రవాహ పరిస్థితిని అంచనా వేసుకుంటూ స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. నదిలో పసుపు, కుంకుమ, పూలు చల్లి పూజలు చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. వర్షాలు ఇలానే కొనసాగితే నీటి మట్టం పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాకాలం ఆరంభంలోనే ముందస్తుగా నివానదిలో పూడిక తొలగించి శుభ్రం చేసిన కారణంగా నీటిమట్టం పెరిగిన స్థానిక నివాసాలకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. సంతపేట వద్ద లిల్లీ వంతెన పరిశీలించారు. ఇన్చార్జి కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్వో డా లోకేష్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, స్థానిక నాయకులు, నగరపాలక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**గూడూరు, మేజర్‌న్యూస్:** పేదలకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని ఎంఎల్ఏ డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పిఆర్ క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి, అగర్వాల్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో పిఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిభిరంలో పాల్గొని, పేదలకు పరీక్షల అనంతరంమందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రతలు తీసుకోవల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వమందిస్తున్న వైద్య సేవలకు తోడు ఇలాంటి సంస్థలు కూడ పేదలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం శుభ పరిణామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, మీరా రెడ్డి, ఇతర పిఆర్ క్లబ్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





## భారీ వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే ఆదిమూలం



**కేవీబీపురం, మేజర్‌న్యూస్:** భారీ వర్షాల కారణంగా నియోజకవర్గం లోని ప్రధాన ప్రాజెక్టులైన కాలంగి అరణీయార్ రిజర్వాయర్ నుండి గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. నది పరివాహక లోతొట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకి చేర్చాలని అన్ని మండల అధికారులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు.

## మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడిగా ఇర్షాద్



**రొంపిచెర్ల, మేజర్‌న్యూస్:** రొంపిచెర్ల మండలం దివ్యాంగుల సంఘం అధ్యక్షుడిగా షేక్‌ఇర్షాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల రొంపి చెర్ల దివ్యాంగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్య దర్శిగా షేక్ మహమ్మదలీ, కార్యవర్గ సభ్యులుగా భాష, రహమాన్, దిలీప్, ఆనంద, వాసు, ఎస్.బావజాన్ ఎన్నికయ్యారు. దివ్యాంగుల సంఘం అధ్యక్షులు షేక్ ఇర్షాద్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసికట్టుగా పోరాటం చేస్తామన్నారు. దివ్యాంగుల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు.

## కేవిబి.పురం నుంచి శ్రీకాళహస్తి వైపు రాకపోకలు నిషేధం

**కేవిబి.పురం, మేజర్‌న్యూస్:** మండలం భారీ వర్షాలు కారణంగా గురువారం ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం పడుతోంది దీంతో ఉదయం వచ్చిన ఆర్టీసీ బస్సులు వెళ్లే దానికి కూడా నీళ్లు అడ్డగించాయి ఎక్కడ చూసినా నీటి ప్రవాహం ఉధృతమైంది పిచ్చాటూరు వైపు వెళ్లిన బస్సులు శ్రీకాళహస్తి వైపు తిరిగి వచ్చే సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు తిమ్మసముద్రం కొత్తూరు వద్ద కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి ఉదయం10 నుంచి ఆర్టీసీ బస్సులు రాకపోకలు ఆగి పోయాయి. విద్యాశాఖ ఆదేశాలు మేరకు పాఠశాలలకు విద్యార్థులు వచ్చి పాఠశాల తిరిగి వెళ్లడం జరిగింది. తిమ్మ సముద్రం బ్రిడ్జిమీద చెట్టుకొమ్ముల అడ్డుపడడంతో బస్సు రాకపోకలు నిలిపివేశారు. మండల కేంద్రంలో కొన్ని పూరిళ్లు గోడలు కూలిపోయాయి.



## డక్కిలిలో జోరుగా వర్షాలు

**మాటుమడుగు గ్రామానికి వెళ్లే కాజ్వేపై వరద నీటి ప్రవాహం.. నీటమునిగిన వరినాట్లు**

**డక్కిలి, మేజర్‌న్యూస్:** తుఫాను ప్రభావంతో గురువారం రోజంతా వర్షం దంచి కొట్టింది. చెరువులన్నీ జలకళతో కళకళలాడుతున్నాయి. మండలంలోని అన్ని చెరువుల్లోకి వర్షపు నీరు భారీగా వచ్చి చేరుతుంది. వెలుగొండ కోండల్లో పడ్డ వర్షపు నీరు సప్లయ్ చానల్స్ ద్వారా చెరువుల్లోకి వచ్చి చేరుతుంది. మండంలోని పలు గ్రామాల చెరువులకు సంబందించిన సప్లయ్ చానల్స్ తెగిపోవడంతో కొండల్లో నుంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహం పంట పొలాల వైపు మల్లడంతో నాగవోలు, మిట్టపాళెం, లింగసముద్రం గ్రామాల్లో వరినాట్లు నీట మునిగాయని రైతులు తెలిపారు. మోపూరు సప్లయ్ చానల్కు గండి పడటంతో సప్లయ్ చానల్స్ ద్వారా వచ్చే వర్షం నీరంతా వృథాగా వెల్లిపోతుంది. అయితే మోపూరు చెరువు నిండి పోవడంతో గండి పడటం వల్ల పెద్దనష్టం లేదని గ్రామస్తులు తెలిపారు.



ఇక మండలంలో ఎక్కడా ఏలాంటి అవాంచ నీయ సంఘటనలు చోటుచేసు కోకుండా తహసీల్దార్ శ్రీనివాసులు తగుచర్యలు తీసుకొంటున్నారు. మాటుమడుగు గ్రామానికి వెళ్లే కైవల్యానది కాజ్వేపై వరద ప్ర వాహం ఉధృతంగా కావడంతో ఆ మార్గాన్ని ముళ్ల కంచే ఏర్పాటు చేసి రాకపోకలను నివారించారు. ఇంకా పలు గ్రామాల చెరువులకు గండ్లు పడకుండా ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గండిపడే పరిస్తితులు తలెత్తితే చెరువు కోసకట్టలు తెగ్గొట్టి చెరువులను కాపాడు కోవాలని రైతులకు సూచించారు. కాగా మండలంలో 80.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

## ఒత్తిళ్లతో పేదలపై కేసులు నమోదు సరికాదు : మాజీ ఎమ్మెల్యే

**గూడూరు, మేజర్‌న్యూస్:** గ్రామాల్లో ఘర్షణలను తగ్గించే విదంగా పోలీసులు వ్యవహరించాలని కక్షలు పెంచే విదంగా ఒత్తిళ్లతో కేసులు నమోదు చేయడం సరికాదని మాజి ఎంఎల్ఏ డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని సనత్ నగర్ లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జ్ వెలగపల్లి వరప్రసాద్ మాట్లాడుతూ దురదృష్టవశాత్తు ఘర్షణలతో కేసుల్లో ఇరుక్కుంటున్న పేదలకు అవగాహన కల్పించాలి కాని లేని వాళ్లను కేసుల్లో ఇరికించి ఎవరి మెప్పుకోసం పని చేయరాదన్నారు. ఇటీవల చిల్లకూరు మండలం నాంచారంపేట, ముత్యాలపాడు గ్రామాలలోని రెండు గ్రూప్‌ల తగాధాలలో ఒక యువకుడు ప్రాణం కోల్పోయిన విషయం బాధాకరమన్నారు. అయితే ఈ సంఘటన సాకుగా చూపి కొందరి కోసం లేని వారిని కేసుల్లో ఇరికించిడం వలన అక్కడ ప్రశాంత వాతావరణం ఏర్పడడం కష్టం అవుతందన్నారు. నిందితులకు శిక్ష పడాలి కాని నిరపరాదులు ఇబ్బందులు గురి కాఊడదని తెలిపారు. సంఘటనతో సంబంధం లేని జెడ్పిటిసి మన్నెం శీనయ్య అరెస్ట్ అవ్వడం చాలా బాధాకరం అన్నారు. శీనయ్య భార్య మరియు కుటుంబ సభ్యులను వెంటతీసుకొని ఎస్పీని కలవడం జరిగిందని, ఎస్పీ కూడా వెంటనే స్పందించి శీనయ్య కుటుంబ సభ్యుల దగ్గర వివరాలు సేకరించారని, ఆయన కుడా చట్టబద్ధంగా తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కి కూడా వాస్తవాలు తెలియజేసామని, ఎమ్మెల్యే కూడా వెంటనే సానుకూలంగా స్పందించి ఎస్పీతో మాట్లాడరన్నారు. పోలీస్ ఉన్నతాధికారులకు జరిగిన సంఘటన పూర్తి విచారణ చేసి సంబంధంలేని మన్నెం శీనయ్యను విడుదలైయ్యేందుకు మార్గం సుగమం చేయాలని ఆయన కోరారు. అలాగే భవిష్యత్‌లో ఇలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా పీస్ కమిటీ ఏర్పాటు చేయాలని పోలీసులను ఆయన కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు దుగ్గన వినీష్ యాదవ్, వంక రమణయ్య, తూపిలి లక్ష్మీ, సయ్యద్ మథర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ సమస్యకు మాజీ ఎంపీపీ శాశ్వత పరిష్కారం

**గుడిపల్లి, మేజర్‌న్యూస్:** తుఫాను ప్రభావం వలన మండలంలో గు రు వా రం ఉదయం నుండి కురిసిన వర్షాల కు కోటపల్లి గ్రామ సమీప ప్రధాన రహదారి లో వర్షపు నీరు చేరడంతో నిండు కుండలా చెరువును తలపిస్తూ వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది. ఈ విషయ్నాన్ని గమనించిన మాజీ ఎంపీపీ, గుడిపల్లి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జిఎం రాజు సొంత నిధుల వేచించి శాశ్వత పరిష్కారాన్ని చూపించారు. కుప్పం నుండి గుడిపల్లికి ప్రధాన రహదారిగా ఉన్న ఈ మార్గం నిత్యం వాహనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది. అటువంటి రహదారిలో వర్షం పడితే దారి మొత్తం చెరువులాగా దర్శనమిస్తూ ప్రజలకు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తుంది. ఆ మార్గంలోనే ఎంతో మంది అధి కారులు వస్తూ పోతూ ఉన్న ఆ సమస్యను పట్టించుకోకపోవడం లేదని ప్రజలు ఎప్పటినుండో అనుకుంటున్నారు, ఈ సమస్య వలన ప్రజలు ఎంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో గమనించిన మాజీ ఎంపీపీ తన సొంత నిధులతో అప్పటికప్పుడు తానే దగ్గరుండి డ్రైనేజీ కాలువ నుండి పైప్ లైన్లను ఏర్పాటు చేసి రోడ్డు మధ్యలో నిల్వ ఉన్న నీటిని తొలగించి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించారు. తమ సమస్యకు పరిష్కారం చూపించిన జిఎం రాజకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండండి

**బిఎన్ కండ్రిగ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిమ్మయ్య**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప



పీడనం కారణంగా తొట్టంబేడు బిఎన్ కండ్రిగ మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న లోతట్టు ప్రాంత ప్రజలను. రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్న బిఎన్ కండ్రిగ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య. తొట్టంబేడు సబ్ ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య వివిధ గ్రామాలలో పర్యటించారు. వారు మాట్లాడుతూ తొట్టంబేడు మండలంలో కొత్త కండ్రిగ. బి.యన్ కండ్రిగలో వెస్ట్ వరత్తూరు వద్ద వాగులు పొంగి పొర్లడంతో ఆ ప్రాంతంలో ప్రజలు ఎవరు రాకపోకలు లేకుండా రోడ్డుకు అడ్డంగా ముళ్లపొదలను వేయడం జరిగింది. అంతే కాకుండా బిఎన్ కండ్రిగ మండలాల్లో ఉన్న వాగులు, వంకలు, కాలువలు వర్షపు నీటితో పోటెత్తాయి. తీవ్ర వర్షాలు కారణంగా గ్రామాల్లోని విస్తృతంగా పర్యటించి సహాయక చర్యలు చేపట్టేలా తన సిబ్బందికి. ప్రజలకి తగు సూచనలు ఇవ్వడం జరిగింది.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదనాచారి గురువారం సూచించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులతో వర్షాలు కురుస్తున్నాయని, జలుబు, దగ్గు వచ్చినప్పుడు మాస్కు తప్పనిసరిగా ధరించాలని, జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ప్రభుత్వా సుపత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందాలన్నారు.



## భారీ వర్షంలోనూ రిలే నిరాహార దీక్షలు చేపట్టిన కార్మికులు

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** ఏపిఎస్ఆర్టీసీ గూడూరు డిపోలో కండక్టర్ డ్రైవర్లు అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలని గత ఏడు రోజులుగా నిరసన ఆందోళన భారీ వర్షం సైతం లెక్కచేయకుండా కొనసాగించారు. దీక్షల్లో అధ్యక్షులు రాము డిపో కార్యదర్శి డి.శ్రీధర్ లను సిఐటియు సీనియర్ నాయకులు గుర్రం రమణయ్య ఎర్ర రిబ్బన్లు మెడలో వేసి దీక్షల్లో కూర్చోబెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్.డబ్ల్యూ.ఎఫ్ సీనియర్ నాయకులు శేషయ్య మాట్లాడుతూ ఈ సమస్య ఎస్‌డబ్ల్యూఎఫ్ ఒక్కరిదే కాదని భవిష్యత్తులో మిగతా యూనియన్లుకు, కూడాఇలాంటి సమస్యలు ఎదురవుతాయని, మిగతా యూనియన్‌ల సభ్యులు కూడా సాటి ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకొని సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ట్రేడ్‌యూనియన్ల నాయకులు జోగి, శివ కుమార్, ప్రజాసంఘాల నాయకులు కె.ఆర్.దాసరి, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్ష,కార్యదర్శులు, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, ఆటో కార్మిక సంఘం నాయకులు ఆర్.శ్రీనివాసులు, వి.భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, దీక్షలు చేపట్టిన శిబిరం వద్దకు వచ్చి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దీక్షల్లో ఎస్.డబ్ల్యూ.ఎఫ్. సభ్యులు జి.వి.రమణయ్య, ఎస్.ఎస్.వి.కృష్ణ, రఘురాం, ప్రభాకర్, డి.ఎస్.వాసులు, చంద్రమోహన్, చంద్రయ్య పాల్గొన్నారు.







# పూర్తిగా నిండిన అరణీయార్ ప్రాజెక్టు

**- 31 అడుగులు, 1.85 టీఎంసీ నీటితో జలాశయం కళకళ**
**- ఇన్ ఫ్లో 5200, ఔట్ ఫ్లో 5600 క్యూసెక్కులు**
**- పొంగి ప్రవహిస్తున్న అరుణా నది**

**పుత్తూరు, మేజర్ న్యూస్:** పిచ్చాటూరు అరణీయార్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 31 అడుగులు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 1.85 టీఎంసీ చేరుకుంది. అదే సమయంలో సాయంత్రం 4.30 గంటలకు జలాశయం పై నుండి అరుణా నది ద్వారా 5400 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై 5600 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు స్పిల్ వే గేట్ల ద్వారా బయటకు పంపుతున్నారు. దీంతో ప్రాజెక్టు దిగువన ఉన్న అరుణా నది ఉధృతంగా ప్రవహించి ఎదురుగా ఉన్న పిచ్చాటూరు - శ్రీ కాళహస్తి కాజ్‌వేపైకి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో పిచ్చాటూరు - శ్రీ కాళహస్తి మధ్య రాకపోకలు స్తంభించాయి. పోలీసులు అప్రమత్తమై కాజ్ ఇరువైపులా పహారా కాస్తూ ఎవరూ దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరిస్తున్నారు. రాత్రికి వరద నీరు మరింత ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, గేట్ల ద్వారా కూడా మరింత నీరు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరూ అరుణానది ని దాటే ప్రయత్నం చేయవద్దని, నది పరివాహక గ్రామాల్లో రెవిన్యూ అధికారులను, సచివాలయం ఉద్యోగులను కాపలా పెట్టారు. అరణీయార్ జలాశయం వరుసగా 6 సార్లు పూర్తి స్థాయిలో నిండడంపట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధనుర్మాసం సందర్భంగా దర్శన వేళలో మార్పులు



**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈ నెల 16వతేది సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభం అవుతుందని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈఓ పీ బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా దేవస్థానం తెరుచు సమయాలు మార్పు వాటి వివరాలు క్రింది విధంగా ఉన్నాయని తెలిపారు. తెల్లవారు జామున 3:00 గంటలకు పరవీధులలో జేగంట ప్రారంభం అవుతుంది. తెల్లవారు జామున 4:00 లకు ఆలయంలో మంగళ వాయిద్యములు ప్రారంభ మవుతాయి. తెల్లవారు జామున 4:15 నిమిషాలకు గోపూజ జరుగుతుంది. తిరుమంజనం తెల్లవారు జామున 4:30 నిమిషాలకు పల్లియర పూజ సుప్రభా తం లేదు. తేవారము ఉంది. ఉదయం 5:00లకు సర్వదర్శనం మెదటి కాల అభిషేకం సేవలు లేవు. ఉదయం 6:00 గం లకు రెండువ కాల అభిషేకము జరుగుతుంది. ఉదయం 7:00 గం లకు పరివార దేవతా నైవేద్యము. 7:30 గం నిమిషాలకు గొబ్బెమ్మ వార్ల ఉత్సవం 10:30 గం : నిమిషాలకు మూడవ కాల అభిషేకము ఉచ్చికాలము. సాయంత్రం 5:00 గం లకు ప్రదోషకాల భిషేకము జరుగుతుంది. రాత్రికి శుక్రవారం శనివారము ఆదివారం సోమవారము ఈ నాలుగు రోజులలో రాత్రి 9:00 గంటలకు పల్లియర పూజ తదుపరి దర్శనం ముగింపు ఉంటుంది. మంగళవారం బుధవారం గురువారం ఈ మూడు రోజుల్లో రాత్రి 9:00 గంటలకు పల్లియర పూజ అనంతరం దర్శనం ముగింపు ఉంటుంది. ధనుర్మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ఆలయం సమయం మార్పు వివరాలు. 13-01-2025న సోమవారం ఆరుద్ర అభిషేకం భోగి పండుగ జరుగుతుందని తెలిపారు.

# ఉచిత పంటల బీమాకు మంగళం?

- నాటి ప్రభుత్వం కట్టింది.. నేటిప్రభుత్వానికేమయ్యింది
- రైతు ప్రీమియం కట్టాల్సిందే
- బీమా చేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు
- టార్గెట్ పూర్తికి సిబ్బందికి హుకుం
- బీమా కట్టమంటున్న కర్షకులు - ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం



రైతుకు అండగా ఉంటాం... ఓట్లు వేయండి...గత ప్రభుత్వాని కంటే ఘనంగా తోడుంటాం.... రైతురాజ్యమని నిరూపిస్తాం... అధికారంలోకొస్తే అన్నీ తామై నడిపిస్తామంటూ ఊదరగొట్టారు... అధికారంలోకి వచ్చారు... ఉచిత పంటల బీమాకు మంగళం పాడారు...... వాటా కట్టాలంటూ ఆదేశాలు జారీ చేశారు.... రైతుల ఆశలను చిదిమేశారు... బీమా చేయండి అంటూ కిందిస్థాయి సిబ్బందిని పురమాయించారు.... రైతులు ససేమీరా అంటున్నారు.... నిలదీస్తున్నారు.... ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

చిత్తూరు జిల్లా వి.కోట గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి ప్రస్తుత ప్రభుత్వం మంగళం పాడింది.పథకాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం రైతుల పాట పాలిట శాపంగా మారింది. ఆరుగాలం శ్రమించే రైతుకు కష్టాల్ని తెచ్చిపెట్టింది. గత ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద రైతుకు అండగా నిలిచేలా రైతు వాటా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించేలా ఆదేశాలు జారీ చేసింది. రైతులు సాగు చేసిన పంటలను కిందిస్థాయి వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-క్రాప్ బుకింగ్ చేస్తే చాలు బీమా కిందకు వచ్చేది. దీంతో రైతు పైసా చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదు. వాతావరణ, ప్రకృతి విపత్తులు దృష్ట్యా పంట నష్టం సంభవిస్తే రైతులకు పరిహారం దక్కేది. ఇలా వి.కోట మండలంలో ప్రతి రైతుకు పరిహారం దక్కింది. ఒక్కో రైతు ఖాతాకు 20వేల నుంచి లక్ష రూపాయలు దాకా రైతు ఖాతాలకు పరిహారం నగదు జమ అయ్యింది. దీంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఆపత్కాలంలో రైతులను ఆదుకున్నారంటూ రైతుల్లో హర్షాధికేతాలు వ్యక్తమయ్యాయి. సుమారు పదివేల మందికి పైగా రైతులు లబ్ధి పొందారు. 4 కోట్ల రూపాయల వరకు రైతులు ఖాతాలో





జమయ్యాయి. ఈ పథకం 2024 వరకు కొనసాగింది.జూన్లో కొత్త ప్రభుత్వం కొలువు తీరింది.ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగిస్తారని రైతులు ఆశగా ఎదురు చూశారు. ఆశలు ఆవిరయ్యాయి. గత 2014 నుండి 2019 వరకు రైతులే ప్రీమియం చెల్లించేలా ఆదేశించిన ఆదేశాలకు జవసత్వాలు పోసింది.తిరిగి ఆ ఉత్తర్వులునే అమలు చేసేందుకు సిద్ధమయింది.ఆ మేరకు రైతు వాటా చెల్లిస్తేనే బీమా వర్తిస్తుందంటూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు మండిపడుతున్నారు.రైతుల పక్షాన నిలబడి ప్రీమియం చెల్లించాల్సిన ప్రభుత్వం బాధ్యతను విస్మరించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కాలంలో రైతులకు మేలు చేస్తామన్న మాటలు ఏడున్నాయంటూ నిలదీస్తున్నారు.రైతే వాటా చెల్లించాలంటూ ప్రభుత్వం నిర్ణయించడం రైతును దగా చేయడమేనని తీవ్రస్థాయిలో రైతులు ధ్వజమేత్తుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు పంటల బీమా పథకం కింద రైతు వాటా కట్టించాలని ఉన్నత స్థాయి అధికారులు కిందిస్థాయి అధికారులను ఆదేశిస్తున్నారు. టార్గెట్ ఇచ్చి మరి పూర్తి చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. ఆ మేరకు ప్రీమియం చెల్లించాలంటూ రైతుల వెంట తిరిగిన రైతులు ససేమిరా అంటున్నారు. ఉచిత పంటల బీమా ఏమయిందంటూ సిబ్బందిని నిలదీస్తున్నారు. ఏమైనా చేయండి. మాకు సంబంధం లేదు. మీరు



ప్రీమియం కట్టాల్సిందే అంటూ గ్రామ స్థాయి వ్యవసాయ, ఉద్యాన సహాయకుల పైస్థాయి అధికారులు ఆదేశిస్తున్నారు.దీంతో ఏమి చేయాలో దిక్కు స్థితిలో వారు తలలు పట్టుకుంటున్నారు. రైతులు ప్రీమియం కట్టమంటే కుదరదంటూ చెబుతున్నారు. ప్రీమియం కట్టకంచకపోతే ఉన్నతాధికారుల వద్ద మాటలు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.ప్రభుత్వం ఉచిత పంటల బీమాను అమలు చేయాలని రైతులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

**కృష్ణమూర్తి రైతు.. దానమయ్యగారిపల్లి**

ఐదు ఎకరాల్లో దానిమ్మ పంట సాగు చేశాను.గతంలో రైతు భరోసా సిబ్బంది పొలాల వద్దకు వచ్చారు. ఈక్రా బుకింగ్ చేశారు.నేను ఎటువంటి భీమా నగదు చెల్లించలేదు. ప్రభుత్వమే ఉచిత పంటల బీమా పథకం కింద రైతు వాటాను చెల్లించింది.అనంతరం పరిహారం కింద 80000 రూపాయలు ఖాతాకు జమ చేసింది.దీంతో రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం రైతులను నుండే వాటా కట్టమనే ఉత్తర్వులు జారీ చేసింది. ఇది రైతుకు తీవ్ర అన్యాయం.ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలి.

**వెంకటరమణ రైతు...మద్దిమకులపల్లి**

నేను ఉద్యాన పంటల సాగు చేస్తాను. టమోటా, బీన్స్, బొప్పాయి,అరటి తదితర పంటలు సాగు చేశాను. గత ప్రభుత్వంలో రైతు భరోసా సిబ్బంది ఈ క్రాప్ బుకింగ్ చేశారు. రైతు వాటా పైసా చెల్లించలేదు.ప్రభుత్వమే ఉచిత పంటల బీమా పథకం కింద రైతు ప్రీమియం చెల్లించింది.అనంతరం వాతావరణ, ప్రకృతి విపత్తులతో పంట నష్టపరిహారాన్ని లెక్కించింది. సుమారు 60 వేల రూపాయలు మా ఖాతాకు జమ చేసింది.ఆపత్కాలంలో రైతులను ఆదుకునేది.ఉచిత పంటల భీమా ద్వారా మాకు పరిహారం అందింది.ప్రస్తుత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేయడం రైతులకు ద్రోహం చేయడమే. వెంటనే ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలి.

**- వి.కోట, మేజర్‌న్యూస్**



# ఎన్టీఆర్ జలాశయం మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**- జలాశయాన్ని సందర్శించిన అధికారులు**

పెనుమూరు, మేజర్‌న్యూస్: తుఫాన్ ప్రభావం వల్ల బుధవారం రాత్రి కురుస్తున్న భారీ వర్షాల వల్ల మండలంలోని కలవకుండా పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ జలాసానికి భారీగా వరద నీరు చేరడంతో జలాశయంలో జలకల సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల కాలవల ద్వారా జలాసానికి భారీగా వరద నీరు చేరడంతో. అధికారులు గురువారం జలాశయాన్ని సందర్శించి భారీగా నీరు రావడంతో అప్రమత్తమైన అధికారులు కలవగుంట, మఠంపల్లి గ్రామాలలో ప్రజలను హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ జలాశయం నుంచి మూడు గేట్ల సుమారు 300 క్యూస్షన్ మీటర్ల వరకు నీటిని విడుదల చేశారు. దీంతో జలాశయం వద్ద భద్రత ఏర్పాటుచే పట్టారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ మురళి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ జయచంద్రనాయుడు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ భరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.





# విడవని వర్షం ఇళ్లకే పరిమితమైన జనం

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పాపీయడం కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వర్షం నిరవధికంగా పడుతోంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. జనంఇళ్లల్లోనే ఉండిపోయారు. బుధవారం రాత్రి నుండి వర్షం నిరవధికంగా కురుస్తోంది. వెదురుకుప్పం మండలంలో వర్షం కారణంగా ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా ప్రజలు రాకపోకలను కొనసాగించ లేకపోయారు. వర్షం నిరవధికంగా పడడంతో గురువారం మండలంలోని పలుచెరువులు నిండిపోయాయి. మరికొన్ని చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలో పలుచెరువులు కు గండ్లు పడే అవకాశం ఉందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా నీటిపారుదల శాఖ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉందని పలువురు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# తుఫాన్ ప్రభావంతో చెరువులు పరిస్థితిని సమీక్షించండి

**- లోతట్టు ప్రాంతాలు ప్రజలకు పునరావాసం ఏర్పాట్లు**
**- దేవస్థానం నుంచి వరద బాధితులకు ఆహారం పంపిణీ**
**- ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని. ఇప్పటికే కురిసిన వర్షాలతో మన చుట్టూ నీళ్లు ఉన్నాయని. ప్రస్తుతం కురిసే వర్షాలకు వరద మరింత పెరిగే అవకాశం ఉందని. రానున్న 48 గంటల పాటు ఈ తుఫాను తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ తెలిపిందని. ఈ విపత్తును అందరం కలిసి పనిచేసి ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పిలునిచ్చారు. ఆ మేరకు ఆయన ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. వర్షం తీవ్రత అధికంగా ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులందరినీ అప్రమత్తం చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇప్పటికే కురిసిన వర్షాలతో మన చుట్టూ నీళ్లున్నాయని ఇప్పుడు కురిసే వర్షంతో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్ష బాధితులకు శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరఫున ఆహారం అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే కురిసిన వర్షాలతో చెరువులు జలకళతో నిండుదనాన్ని సంతరించుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో చెరువుల సంరక్షణకు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు కట్టలు తెగకుండా, బొంగలు పడకుండా ముందస్తు జాగ్రత చర్యలు చేపట్టాలన్నారు. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు సాహసం చేసి దాటే ప్రయత్నం చేయొద్దని కోరారు. ఎక్కడ ఏ అవసరం వచ్చిన సాయం చేయడానికి సిద్దంగా ఉన్నామన్నారు. తాను కూడా కొన్ని ముంపు ప్రాంతాల్లో పరిష్కరిస్తానన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది తమ తమ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండి తక్షణ సాయం అందించాలన్నారు. నియోజకవర్గంలో వర్ష ప్రభావంపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్, ఆర్డీవోతో సమీక్షిస్తున్నామని తెలిపారు. ఎక్కడ అవసరమైనా స్వయంగా వచ్చి సహాయ చర్యలు చేపట్టడానికి సిద్దంగా ఉన్నానని తెలిపారు. కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు కూడా వర్ష బాధితులను సహాయ సహకారాలు అందించడానికి ముందుకు రావాలని కోరారు. ఇలా అందరం కలిసి ఈ విపత్తును ఎదర్కొని ప్రజలను కాపాడడానికి సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు.



# గిరిజన బతుకుల్లో మార్పు తెచ్చిన మారేడు గడ్డల పంట

అక్షర జ్ఞానం లేని అమాయక గిరిజన రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తే ఏ ఇతర రైతుతోనైన సమానంగా పంటలు పండించి ఎందు లోను తగ్గేదేలే అని నిరూపిస్తున్నారు. లెక్కలపూడి వాండ్ల వూరు,ఎస్టీ కాలనీకి చెందిన గిరిజన రైతులు అడవిలో పండే మారేడు (గడ్డ)ను సాధారణ పంటగా మార్చి తమ పొలాలకు తీసుకొచ్చి పండిస్తున్నారు. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం లెక్కలపూడి వాండ్ల గ్రామ యానాది కులానికి చెందిన తులసి, రమేష్,వెంకటేష్, గిరిజనులు రైతులుగా మారారు. మారేడు (గడ్డ) పండించి లక్షల ఆదాయం ఆర్జిస్తున్నారు. మారేడు గడ్డలు అటవీ ప్రాంతంలో పండుతాయి. ఆ గడ్డలను కుటుంబంతో సహా తీసుకొచ్చి సంతలో అమ్మేవారు. మారేడు గడ్డలను బెంగుళూరు, హైదరాబాద్ నుంచి వచ్చిన పెద్ద ఆసాములు మంచి ధర ఇచ్చి కొనుగోలు చేసేవారు. వేసవి కాలంలో మనం తాగే షరబత్, తయారీకి ఉపయోగించేవారు. వేసవి కాలం పెరిగింది. షరబత్ తాగి వేసవి తాపం తగ్గించుకుందాం అనే ప్రజల సంఖ్య కూడా పెరిగింది. అందులోను ఉబ్బసం వంటి వ్యాధుల నిరోధానికి వాడె ఆయుర్వేదిక్ మందుల తయారీ కూడా దీంతో మార్కెట్ లో మారేడు గడ్డకు విపరీత డిమాండ్ ఏర్పడింది. అడవి నుంచి మారేడు తెచ్చే సమయంలో అటవీ శాఖ అధికారులు అడ్డగించి ఎర్రచందనం కలప తీసుకొస్తున్నారా అంటూ అమాయక గిరిజనులను ఇబ్బంది పెట్టేవారు. ఇలాంటి సంఘటనలు అమాయక గిరిజన రైతులకు సాధారణమయ్యాయి. అయినా ఉదయమే ఫారెస్టు నుంచి గడ్డలు తేవడం ఆసాములకు కొద్దిపాటి సరుకే అయ్యింది. రమేష్, తులసిలకు ఒక ఆలోచన తట్టింది. మారేడు గడ్డ పంట మేమే మా పొలాల్లో వేస్తే అనే ఆలోచన కలిగింది. అటవీ ఇబ్బందులు కూడా వుండవు కదా అనుకొన్నారు.కుటుంబం అంత అడవి వెళ్ళడం ఎక్కడెక్కడో పండిన గడ్డలు ఒక చోటికి చేర్చడం ఇబ్బంది అనిపించింది. విత్తనాల కోసం కర్ణాటక రాష్ట్రానికి బెంగుళూరుకు వెళ్లారు. మారేడు విత్తనాలు కిలో రూ. 1500 కొని తీసుకొచ్చి తమకు ప్రభుత్వం భూపంపిణి పథకం క్రింద ప్రభుత్వం ఇచ్చిన పొలంలో నాటారు. భూమిలో పెరిగే ఈ గడ్డలు ప్రకృతి సిద్ధమైన అటవీ వాతావరణం లోనే చక్కగా పెరిగాయి. వీటికి ఎలాంటి ఎరువులు వాడకుండా కేవలం 15 రోజుల కోసారి నీరిస్తే పంట చక్కగా వస్తుంది. సుమారు రెండేళ్ళు కాలానికి పంట చేతికొచ్చింది. కర్ణాటక, హైదరాబాదు నుంచి ట్రేడర్లు వచ్చి సరుకంతా తీసుకెళ్ళారు. మారేడు గడ్డల విక్రయంలో గిరిజనులైన రమేష్, తులసిలకు ఎకరాకు 7.5 లక్షల రూపాయల ఆదాయం సంపాదించారు. తిరిగి విత్తనాలు తీసుకొచ్చారు. మారేడు పంటను పండించారు. 8 ఏళ్లుగా సాగుతున్న పంట గిరిజన రైతుల దశ, దిశను మార్చేసింది. పూరి గుడిసెలో నివసిస్తున్న రమేష్, తులసి కుటుంబం పక్కా గృహం గృహనిర్మాణ సంస్థ ఆర్థిక సహాయంతో ఇల్లు కూడా నిర్మించుకొంది. ఆదర్శంగా నిలిచి రమేష్, తులసిలను చూసి సుమారు పది గిరిజన కుటుంబాలు మారేడు గడ్డలు పండిస్తున్నారు. వారు కూడా మంచి ఆదాయం తీసుకున్నారు. కాపు పెరగడంతో కిలో 500 రూపాయలు కొనే ట్రేడర్లు రూ. 250 కి తగ్గించారు. అయిన పంట పండించడంలో ఎలాంటి ఖర్చు లేదు. పురుగుల మందులు అవసరం లేదు. ఒకసారి విత్తనం నాటేస్తే మధ్యలో నీరుకట్టి తిరిగి రెండు సంవత్సరాలకు పంట తీసుకోవడమే వేసవి కాలానికి అవసరమైన సరుకు అయినందున సుమారు 50 ఎకరాలలో ఆ గ్రామ గిరిజన రైతులు పండిస్తున్నారు. గ్రామంలో సుమారు 10 గిరిజన కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నారు.

### ఆర్థికంగా సామాజికంగా ముందుకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉంది

**– కలెక్టర్ సుమిత్ కుమార్**



మారేడు గడ్డ పంటతో లెక్కలపూడి గ్రామ గిరిజన రైతులు మంచి ఆదాయం పొందుతున్న తీరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి రావడం. గిరిజన రైతులకు బిందు సేద్యం పరికరాలు అందించారు. మరి కొంత మంది డ్రిప్ సౌకర్యం అందించేందుకు రైతుల నుంచి ధరఖాస్తులు తీసుకొన్నారు. వెంటనే వారికీ కూడా డ్రిప్ పరికరాలు, ఇరిగేషన్ అందజేయాలని ఉద్యాన శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం డ్రిప్ తో పాటు, పొలాలు లేని రైతులకు భూ పంపిణీ కార్యక్రమంలో భూములు ఇచ్చేందుకు సిద్దంగా వున్నారు. ఆధార్ కార్డు లేని యానాది కుటుంబాలకు కార్డులు ఇవ్వమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, సామాజికంగా ముందుకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు.



**– చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్**

# రేణిగుంట ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ రాజేష్ సస్పెన్షన్



**రేణిగుంట, మేజర్‌న్యూస్:** రేణిగుంట సబ్ రిజిస్టర్ కార్యాల యంలో ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ గా విధులు నిర్వహిస్తున్న రాజేష్ పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. గతవారం రేణిగుంట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రెండు రోజులపాటు విస్తృత తనిఖీలు చేపట్టిన రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నత అధికారులు స్వాధీనం చేసుకున్న కీలక పత్రాలు లో భారీ ఎత్తున అవకతవకలుకు పాల్పడ్డారని అధికారులు డిఐజి అధికారికి నివేదిక అందించడంతో గురువారం డీఐజీ అధికారి సస్పెన్షన్ మేటు వేశారని డిస్టిక్ రిజిస్టర్ శ్రీరామ్ కుమార్ తెలిపారు.

# తిరుమలలో ఘనంగా చక్రతీర్థ ముక్కోటి



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమలలో చక్రతీర్థ ముక్కోటి గురువారం ఘనంగా జరిగింది. ప్రతి ఏడాదీ కార్తీక మాసంలో చక్రతీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయ అర్చకులు, పరిచారకులు, భక్తులు ఉదయం మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుండి ఊరేగింపుగా చక్రతీర్థానికి చేరుకున్నారు. అక్కడ శ్రీ చక్రత్తాళ్వారుకు, నరసింహ స్వామివారికి, ఆంజనేయస్వామివారికి అభిషేకం, పుష్పాలంకారం చేపట్టి హారతి ఇచ్చారు. హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.స్కంద పురాణం ప్రకారం పద్మనాభ మహర్షి అనే యోగి చక్రతీర్థంలో 12 సంవత్సరాలు తపస్సు చేశాడు. అందుకు సంతసించి శంఖు, చక్ర, గధా భూషితుడైన శ్రీ మహావిష్ణువు ఆతనికి ప్రత్యక్షమై కల్పాంతం వరకు తనకు పూజలు చేయాలని చెప్పి అంతర్థానమయ్యాడు. పద్మనాభ మహర్షి స్వామి ఆజ్ఞానుసారం చక్రతీర్థంలో తపస్సు చేశాడు. ఒకనాడు ఓ రాక్షసుడు అతనిని భక్షించడానికి రాగా మహర్షి తిరిగి స్వామివారిని ప్రార్థిం చాడు. అప్పుడు స్వామి తన చక్రాయుధాన్ని పంపించి ఆ రాక్షసుని సంహరించాడు. అటు తరువాత ఆ మహర్షి శ్రీ సుదర్శన చక్రాన్ని ఆ ప్రాంతంలోనే ఉండి భక్తులకు రక్షణ కల్పించాల్సిందిగా స్వామివారిని కోరాడు. భక్తవల్లభుడైన స్వామివారు తన సుదర్శన చక్రాన్ని ఆ ప్రాంతంలోనే ఉండేలా ఆజ్ఞాపించడంతో ఈ తీర్థం చక్రతీర్థంగా ప్రసిద్ధిగాంచింది.

## నిడిగుర్తిలో రెవెన్యూ సదస్సు



**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలంలోని నిడిగుర్తి గ్రామంలోని సచివాలయం వద్ద గురువారం రెవిన్యూ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సులకి తాసిల్దార్ రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణ రావు, డిప్యూటీ తహశీల్దార్ సందీప్ కుమార్, మండల సర్వేయార్ శకుంతల, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, వివిధ శాఖల సిబ్బంది, టిడిపి నాయకులు తీపలపూడి రమణయ్య, మాజీ సర్పంచ్ బిజెపి నాయకుడు వాకాటి సంపత్ కుమార్, కిషోర్ రెడ్డి,కె విజయరత్నం, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా భూ సమస్యలతో రైతులు బాధపడుతు న్నారన్నారు, ఈ సదస్సులో వచ్చినటువంటి ప్రతి సమస్యలను అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాలని అధికారులను గ్రామస్తులు కోరారు. భూ సమస్యల మీద అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని తహశీల్దార్ రామయ్య తెలిపారు. ఎంపీడీవో అన్నపూర్ణ రావు మాట్లాడుతూ అభివృద్ధి పరంగా వచ్చినటువంటి అర్జీలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో అన్నారు. ఈ సదస్సులో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటగిరిలో మళ్లీ వర్షం... ఆందోళనలో రైతులు



**వెంకటగిరి. మేజర్ న్యూస్:** తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలో గురువారం రాత్రి నుండి జోరుగా వర్షం కురుస్తుంది.మొన్నటి వరకు ఫెంగల్ తుపాన్ వల్ల దాదాపుగా చెరువులు నిండిపోయాయి అయితే ఇప్పుడు మరొక మరొక అల్పపీడనం లేవడంతో మళ్లీ వర్షాలు మొదలయ్యాయి.ఈ వర్షాలు రెండు రోజులు పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు ఉంటాయని వాతావరణ కేంద్ర అధికారులు తెలిపారు. అయితే ఇప్పటికే నారు పోసిన రైతులు ఈ వాన ముప్పు వలన చెరువులు తెగితే తమకు నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం సరైన భద్రత చర్యలు చేపట్టాలని వారు కోరారు.శుక్రవారం కూడా వర్షాలు కొనసాగుతాయి అని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 48 గంటలు అప్రమతంగా ఉండాలని అధి కారులు తెలిపారు.వెంకటగిరి మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలీస్ అధికారులు వాగులు ఎవరు దాటకుండా భద్రత ఏర్పాటు చేస్తే బాగుంటుంది అని ప్రజలు కోరుతున్నారు.

## తుపిలిపాలెంలో విద్యా వికాస్ కేంద్రం ప్రారంభం



**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలంలో తూపిలిపాలెం మత్స్యకార గ్రామంలో శ్రీ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా వికాస కేంద్రాన్ని (సాయంత్రం పాఠశాలను) ప్రారంభించినట్లు శ్రీ భారత్ ట్రస్ట్ చైర్మన్ కె కోటేశ్వరరావు తెలిపారు. మత్స్యకార పిల్లలకు సాయంత్రం పూట 2వ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి వరకు విద్యతో పాటు, యోగాసనాలు, క్రీడలు, ఆరోగ్యం తదితర విషయాల పై విద్యార్థులకు శిక్షణ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు.పతి విద్యార్థికి వృత్తి నైపుణ్యం, కుటుంబ వ్యవస్థ పై గౌరవం, క్రమశిక్షణ, మంచి నడవడిక తదితర విషయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. తీర ప్రాంత గ్రామమైన మత్స్యకార గ్రామంలో పేద విద్యార్థుల కోసం సాయంత్రం పాఠశాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పాఠశాల ప్రారంభం కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు పామంజి పాలయ్య లక్ష్మణరావు, కొండూరు చిన్న వెంకటేశ్వర్లు, కాటంగారి కోటేశ్వరరావు, విద్యా వికాస కేంద్రం ఉపాధ్యాయురాలు కళాంజి తనీల తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



**కార్వేటి నగరం మేజర్‌న్యూస్:** భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నాగరాజు అన్నారు. కార్వేటి నగరం మండలం గోపి శెట్టిపల్లి పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు రిసర్వ్ లో జరిగిన అవకతవకలపై అదేవిధంగా గ్రామాల్లో భూ సమస్యలపై చిన్న చిన్న వివాదాలు ఉన్న ఈ సదస్సులో రైతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చని ఈ సందర్భంగా తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయార్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ త్యాగరాజు, ఆర్ ఐ కిరణ్ కుమార్ , సబ్ రిజిస్ట్రర్ సత్య ప్రసాద్, సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కింపు

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** కార్వేటి నగరంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణు గోపాలస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని టిటిడి అధికారులు నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయంలో ఒక లక్ష 1200 రూపాయలు, ఆలత్తూరులో వెలసిన వరద వెంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కించారు ఈ ఆలయంలో 1504 వచ్చినట్లు ఏఈఓ రవి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్ కుమార్, షరాబు బాబు సురేష్ పాల్గొన్నారు.

## జలదిగ్బంధంలో తడ మండలం

- రోడ్లపై నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం
- మోకాళ్ల లోతు నీళ్లల్లో గ్రామాలకు వెళుతున్న ప్రజలు, కార్మికులు





**తడ, మేజర్ న్యూస్:** బంగాళాఖాతంలో ఏర్పడి అల్ప పీడనం ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో తడ మండలం జలదిబ్బందుల్లో చిక్కుకుంది. రహదారులపై నీళ్లు నిలిచిపోవడంతో వాహనాలు రాకపోకలు స్తంభించిపోయాయి ప్రజలు, కార్మికులు సొంత గూటికి చేరేందుకు మోకాళ్ళని లోతు నీళ్లలో నడిచి వెళుతున్నారు ప్రధానంగా తడ పట్టణంలో బిగ్ స్టే వద్ద జాతీయ రహదారిపై నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా తడ పట్టణంలోకి వచ్చే సర్వీస్ రోడ్డు పూర్తిగా నీటితో మునిగిపోవడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. మండలంలోని లోతట్టు ప్రాంతాలైన కాదలూరు, మాంబట్టు, వెండ్లూరుపాడు తదితర ప్రాంతాలలో వర్షపు నీరు ఇళ్లల్లోకి వస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మాంబట్టు సెజ్ లో ఉన్న పలు పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు విధులు ముగించుకొని సొంతగూటికి చేరుకునేందుకు పోగా ఆ రోడ్డుపై వాహనాలు వెళ్లకపోవడంతో కాలినడకతో మోకాళ్లలోతు నీళ్లల్లో కార్మికులు, ప్రజలు వెళుతున్నారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ , స్థానిక ఎమ్మెల్యే దా" నెలవల విజయశ్రీ మండల అధికారులను అప్రమత్తం చేశారు దీంతో తడ తాసిల్దార్ శరత్ బాబు, ఎంపీడీవో ఎన్ విజయకుమార్, ఎస్సై కే కొండప్ప నాయుడు, హౌసింగ్ ఏఈ, విద్యుత్ శాఖ ఏఈ, వ్యవసాయ శాఖ ఏవో కిరణ్, అన్ని పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు అప్రమత్తమై తుఫాన్ కారణంగా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. లోతట్టు ప్రాంతంలోని ప్రజలు ను పునరావస కేంద్రాలకు ముందు జాగ్రత్తగా తరలిస్తున్నారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయండి

**- అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని కోర్టు సముదాయంలో డిసెంబర్ 14వతేదీ జరిగిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్ ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. న్యాయమూర్తి శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణం కోర్టు ఆవరణలో డిసెంబర్ 14వతేదీ జరుగు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర జిల్లా న్యాయ సేవ సంస్థ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి కోర్ట్ ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కోర్టులో పెండింగ్ ఉన్న సివిల్ వివాహ మోటార్ వాహన సంబంధ కేసులతో పాటు. రాజీ కాదగిన క్రిమినల్ కేసులు. వ్యాజ్యం వేయని కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు. పోలీస్ అధికారులు. వివిధ సంస్థ అధికారులు ఈ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి సహకరించాలని కోరారు.

## రైతు గర్జనకు తరలిరండి : కామిరెడ్డి



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** రైతు సమస్యలపై పోరాటం చేసేందుకు రైతు గర్జనకు చలో నెల్లూరు కార్యక్రమానికి మండలంలో ఉన్న రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు సూళ్లూరుపేట నియోజక వర్గ మాజీ శాసనశాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య సారధ్యంలో నేడు చలో నెల్లూరు కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్బంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పి నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు మాసాలు ఐనా రైతులకు ఒక్క రూపాయి కూడా అందించకపోవడంపై రైతులు మండిపడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతుల కొరకు ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీబవ పథకం ద్వారా ఒక్క విడుత కూడా రైతులకు డబ్బులు జమచేయకపోవడం దారుణమన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం లేదని, గత ప్రభుత్వంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రైతుల సమస్యలను ఎత్తిచూపెందుకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో నేడు ఉదయం 10 గంటలకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన వినతి పత్రం అందచేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమమానికి పెళ్లకూరు మండలంలోని రైతులు నేడు ఉదయం 8 గంటలకు గోమతి సర్కిల్ నుండి చలో నెల్లూరుకు వెళ్లడం జరుగుతున్నారు. మండలంలోని రైతులు పెద్ద ఎత్తున రైతు గర్జనకు తరలి వచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

## కూలిన అంగన్వాడీ ప్రహరీ



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మేజర్ పంచాయతీ గుండు గురుస్వామి వీధిలో శివాలయం ఆలయం ప్రక్కన ఉన్న అంగన్వాడీ కేంద్రంలో వర్షానికి ప్రహరీ గోడ పూర్తిగా కూలిపోయింది. వర్షం పడడంతో పాఠశాలకు జిల్లా స్థాయి అధికారులు సెలవు ప్రకటించారు. దీనివల్ల ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకుంటే పోయింది. అదే సమయంలో పాఠశాల ఉంటే పెద్ద ప్రమాదం జరిగేది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పడిపోయిన ప్రహరీ గోడను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## యువ నేస్తం ఎం మునిశేఖర్‌కు అన్నమయ్య సేవా రత్న పురస్కర్ అవార్డు



**ఏర్పేడు, మేజర్‌న్యూస్:** మండలానికి చెందిన యువనేస్తం అసోసియేషన్‌కు అన్నమయ్య జిల్లా రాజంపేటలో గౌరవం దక్కింది. విభిన్న ప్రతిభావంతుల 65వ దినోత్సవం సందర్భంగా యువ నేస్తం అసోసియేషన్ చేసిన సేవలను గుర్తించి రాజంపేటలో ఏర్పాటు చేసిన విభిన్న ప్రతిభావంతులు సేవా సంఘం చేతులు మీదుగా యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్‌కి అన్నమయ్య సేవా పురస్కార్ అవార్డ్‌ను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మునిశేఖర్ మాట్లాడుతూ ఈ అన్నమయ్య సేవారత్న పురస్కార్ అవార్డ్‌ను నన్ను అందుకోవడం చాలా సంతోషంగా ఉందని అని తెలిపారు. యువనేస్తం అసోసియేషన్ తరుపున విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం వారికి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమం లో రెండు తెలుగు రాష్ట్రాలు స్వచ్చంద సేవ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంత ప్రజలను ఆదుకోండి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** నియోజకవర్గంలో వివిధ మండలాలలో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజానీకాన్ని కురుస్తున్న భారీ వర్షాలు మరింత ముప్పులోకి నెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వ్యవసాయ, భవన నిర్మాణ రంగ కూలీలకు పని కరువైందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై లోతట్టు ప్రాంత ప్రజలకు అండగా నిలబడాలని సూచించారు. ప్రతి కుటుంబానికి 15 కిలోలు బియ్యం. రెండు లీటర్ల ఆయిల్. కంది పప్పు. తదితర నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా రెండు రోజులుగా ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ రంగ కూలీలకు రూ.వెయ్యి భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు.

## రెవెన్యూ సదస్సులతో రైతులు కష్టాలు దూరం



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** రెవెన్యూ సదస్సులతో రైతుల కష్టాలు దూరమవుతా యని టిడిపి మండలాధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు గురువారం బీంగానపల్లి పంచా యతీలోని భీంగానపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు ఈ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభు త్వంలో అనేక భూ ఆక్రమణలుజరిగాయని రైతులు రెవెన్యూ ఆఫీసర్ లు చుట్టూ తిరిగిన పట్టించుకునే నాధుడు కరువయ్యారని కూటం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లోకి అధికా రులు వచ్చి వారి సమస్యలను అడిగి మరి వారి సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తున్నారన్నారు అనంతరం ఎం ఆర్ ఓ రాము ప్రజల వద్ద నుండి వినతి పత్రా లు స్వీకరించారు ఈ కార్యక్రమంలో రమణ, గంగాధర, సుబ్రహ్మణ్యం ఆర్.సి వెంకటరమణ, సి వెంకటరమణ, గంగిరెడ్డి, ఆనంద, ఎం వెంకటరమణ గంగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాళహస్తిలో డొక్కా సీతమ్మ అన్నదానం

**- జనసేన పార్టీ ఇంచార్జ్ కోట వినుత చంద్రబాబు**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి వినుత కోటా ఆధ్వర్యం లో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తి తో శ్రీకాళహస్తి పట్టణం నందు ప్రతి గురు వారం మధ్యాహ్నం బస్టాండ్ సెంటర్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం 22వ వారం బస్టాండ్ సెంటర్లో అన్నదానం నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇంచార్జ్ పేట చంద్రశేఖర్, పట్టణ ఉపాధ్యక్షులు జ్యోతిరామ్, పేట చిరంజీవి, హేమంత్ కుమార్, దినేష్, కత్తి మనీ, షేక్ యాసిన్, ముని చంద్ర, సాయి, గురు, ముని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని పెళ్లకూరు మండల తహసీల్దార్ ఎస్.ద్వారకా నాద్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ ఆదేశాలు మేరకు గురువారం చింతపూడి పంచాయతీలో రెవిన్యూ సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా పంచాయతీలో 1-బిల కరెక్షన్ మీద అర్జీలు రావడం జరిగిందన్నారు. వచ్చిన అర్జీ



లను పరశీలించి సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సిబ్బంది కృషిచేస్తా రన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ సంతోషి బాయి, గ్రామ రెవిన్యూ అధికారి కళ్యాణి, గ్రామ సచివాలయ సర్వేయర్ సూర్య నారాయణ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య,నాయకులు వట్టికుండల శేఖర్ నాయుడు, మురళి నాయుడు, సిద్దలయ్య నాయుడు, మెరుం చంద్ర, స్థానిక నాయకులు రాపూరు పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## వెండ్లూరుపాడులో రెవెన్యూ సదస్సు

**తడ, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని వెం డ్లూరుపాడు గ్రామంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవె న్యూ సదస్సును తహశీల్దార్ శరత్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో పరి ష్కారం కానీ రెవిన్యూ సమస్యలను తీర్చడానికి ఈ సదస్సును నిర్వహిస్తుందని తాసిల్దార్ తెలిపారు. అనంతరం తాసిల్దార్ శరత్ బాబు రైతులతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలకు సంబంధించి అర్జీలు అందజేయాలని కోరారు ఈ మేరకు సాగు చేసుకుంటున్న పొలాలను సర్వే చూసి చూపించాలని, కొందరు రైతులు తమ భూములకు పాసుపుస్తకాలు ఇవ్వాలని, మరికొందరు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అర్జీలు సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, వీఆర్వో చలపతి, సెక్రటరీ కళా గాబ్రెల్, సర్వేయర్ పెంచలయ్య, రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వనజ, సచివాలయ సిబ్బంది దేవదాయ శాఖ, సబ్ రిజిస్టర్ కార్యాల సిబ్బంది గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## సహాయక చర్యలు చేపడుతున్న అధికారులు



**రేణిగుంట, మేజర్‌న్యూస్:** అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఇందులో భాగంగా రేణిగుంట పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి సిబిడి కాలనీ వెనక ఉన్న బాలాజీ నగర్ వద్ద ఉన్న భారీగా వర్షపు నీరు చేరడంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట ఎంపీడీవో విష్ణు చిరంజీవి సంఘటన స్థలం చేరుకొని మర్రిగుంట చెరువు వర్షపు నీరు అధికమవడంతో అక్కడ చిక్కుకున్న ఒక కుటుంబాన్ని అధికారులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చే సహాయక చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... రేణిగుంట మండలంలో అధికారులు పార్టీ నాయకులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి వర్షపు నీరు కారణంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజలకు త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టలాని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో రేణిగుంట టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా బాలాజీ నగర్ చేరుకొని వర్షం కారణంగా జరుగుతున్న పరిస్థితులపై సుధీర్ రెడ్డికి సమాచారం అందించారు.

## యధావిధిగా తరగతులు నిర్వహణ

**కోట, మేజర్ న్యూస్ :** మండలంలోని విద్యానగర్ లో ఉన్నటువంటి విద్యావికాస్, కోట ప్రగతి కళాశాలలు కలెక్టర్ ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయకుండా యధావిధిగా తరగతులు నిర్వహించారు. తిరపతి కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఉదయం ఎక్కువ మోతాదులో వర్షం కారణం వల్ల పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కోట ఎంఈఓ పరిధిలో ఉన్నటువంటి కోట ప్రగతి , విద్యానగర్ లో ఉన్నటువంటి విద్యావికాస్ పాఠశాలలు పిల్లలని ఇంటికి పంపకుండా అక్కడే మధ్యాహ్నం ఒకటిన్నర వరకు పిల్లలని నిలిపివేశారు.

## నిరంతరం తెలుగు భాషా సేవలో పి. తులసీనాధం నాయుడు



**పలమనేరు, మేజర్ న్యూస్:** తెలుగు భాష పరిరక్షణే ధ్యేయంగా 2012 లో తెలుగు సాహిత్య సంస్కృతిక సమితిని స్థాపించి నిరంతరం తెలుగు భాషా సేవలో మునిగితేలుతూ పుష్కర కాలాన్ని పూర్తి చేసుకున్న పి. తులసి నాదం నాయుడు గురించి తెలుసుకుందాం చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం ఆరిమాకులపల్లి గ్రామంలో చిన్న బుజ్జి నాయుడు మునెమ్మ దంపతులకు జన్మించిన ఐదవ సంతానంగా జన్మించిన పి. తులసీనాదం నాయుడు ప్రస్తుతం గంగవరం మండలం కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తనకొచ్చే జీతం డబ్బులను తెలుగు భాషా రక్షణకు వినియోగిస్తున్నారు.వారు చేసినకార్యక్రమాలలోకొన్నింటిని గురించి తెలుసుకుందాం వేలాది కార్యక్రమాల నిర్వహణ : సెలవు రోజులలో బడి సమయం ముగిశాక ఇతర ప్రత్యేక దినాలలో భాషా సదస్సును పిల్లలకు భాషా పోటీలు కవి సమ్మేళనాలు, పుస్తక పరిచయాలు, ఆవిష్కరణలు చర్చ కార్యక్రమాలు తెలుగు రచయితల జయంతులు, వర్ధంతులు, భాషా దినోత్సవాలు లాంటివి వేలాది కార్యక్రమాలు నిర్వహించిగుర్తింపు తెచ్చుకున్నారు. కళామందిరం నిర్మాణం: భాషా సాహిత్య కార్యక్రమాల నిర్వహణ కోసం తన శ్రీమతి పుష్ప సహకారంతో తమ 30 లక్షల రూపాయల విలువైన స్థలంలో 20 లక్షల రూపాయలు తమ సొంత నిధులు వెచ్చించి సొంతంగా కళామందిరంను నిర్మించుకొని అందులో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లక్షన్నర పుస్తకాల పంపిణీ: పుస్తకాలు చదవడం ద్వారానే భాష మనుగడ సాగిస్తుందని భావించి 1,50వేల పుస్తకాలనుఈ పుష్కరకాలంలో వివిధ సందర్భాలలో విద్యార్థులకు జాతీయస్థాయిలో పంచిపెట్టారు. మరో 50 వేల పుస్తకాలను పంచిపెట్టడానికి కృషి చేస్తున్నారు.పుస్తకాలు పంచిఊరుకోకుండా వారికి పోటీలునిర్వహించిబహుమతులు అందిస్తున్నారు.

**నీతి పద్యాల పోటీలు:** ప్రతి రెండు నెలలకు ఒకసారి నీతి పద్యాల పోటీలను నిర్వహించి 100కు పైగా పద్యాలు చెప్పగలిగే పిల్లలందరికీ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, పుస్తక బహుమతులు అందిస్తున్నారు తెలుగు భాషా బందు, బాల బంధు, బాల సాహిత్య బంధు,తెలుగు భాషా సేవారత్న, అభినవ శ్రీకృష్ణదేవరాయలు తెలుగు బందు ఉపాధ్యాయ రత్న లాంటి అనేక బిరుదులను అందించారు.

## కిశోరి వికాసంపై అంగన్‌వాడీలకు శిక్షణ

**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసిడిపిఓ అమరజ్యోతి హాజరైనారు. ఈ సందర్భంగా ఆవిడ మాట్లా డుతూ 11నుండి 18 సంవత్సరాల వయస్సు గల కిషోరీ బాలికలకు గ్రామస్థాయిలో ఏవిధంగా రక్షణ కల్పించాలో, పౌష్టికాహారం గురించి తెలియజేశారు. అనీమియా, ఆరోగ్య రక్షణ, పరిసరాల పరిశుభ్రత గురించి పిహెచ్‌యన్ కృష్ణవేణి ప్రస్తావించారు. ఎస్సై నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ఈ మద్య కాలంలో అమ్మాయిలపై అఘాయిత్యాలు



ఎక్కువ అవుచున్నాయని, వాటిని నివారించాల్సిన అవసరం మనందరి పైన ఉందని, ఎక్కడైనా అమ్మాయిలపై ఈవ్ టీజింగ్ వంటివి ప్రజల దృష్టికి వచ్చిన వెంటనే మాకు తెలిజేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, అలాగే మైనర్ బాలికలపై అనుచిత ప్రవర్తన, అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. స్కిల్ డెవలప్మెంట్ పోగ్రాం గురించి ఏపీఎం సుబ్రమణ్యం తెలియజేశారు. కిషోర బాలికలు యుక్త వయస్సు లో తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. ఈ మద్యకాలం లో బాల్యవివాహాలు ఎక్కువ అవుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కేశవరెడ్డి వివరిస్తూ, చదువు వలన ఉపయోగాలు తెలియజేస్తూ, చదువును మద్యలో ఆపేయడం వలన జరిగే అనర్థాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ కేశవరెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ పవన్ కుమార్, నవీన్ కుమార్, ఏ.ఓ షబ్బీర్ అహమ్మద్, అధ్యాపకులు రాజేశ్వరి,ఏపియం సుబ్రమణ్యం, పిహెచ్‌యన్ కృష్ణవేణి, ఐసిడియస్ సూపర్ వైజర్లు రమాదేవి, సులోచనా, సచివాలయ మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, వెల్‌ఫేర్ అసిస్టెంట్లు, ఉపాధ్యా యులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## కిషోరి వికాసంపై శిక్షణ తరగతులు

**యాదమరి, మేజర్‌న్యూస్:** బాల్య వివాహాలను అరికట్టాలని మండల అభివృద్ధి అధికారి వేణు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కిషోరి వికాసం మండల స్థాయి ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి అంగన్వాడి వర్కర్స్, ఏఎన్ఎం, జి ఎం ఎస్ కె, ఆశాలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పీహెచ్సీ డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ 11 నుండి 18 సంవత్సరాలు కలిగిన కిషోర్ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కలిగి ఉండాలని పౌష్టిక ఆహారం తీసుకుంటూ రక్తహీనత బారిన పడకూడదని తెలిపారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయకూడదన్నారు. గర్భిణీలుగా ఉన్న సమయంలో సరైన పౌష్టికాహారం లేకపోతే మాతా సిర్ణాలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. అంతేకాకుండా వారు అనారోగ్యం బారిన పడి అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశానికి తాసిల్దార్ పార్థసారథి , ఎంపీడీవో వేణు, విద్యాశాఖ అధికారి రుక్మిణి, మాదిరెడ్డిపల్లి పీహెచ్సీ డాక్టర్లు శివకుమార్ మరియు వరప్రసాద్ ఎం పి హెచ్ ఈ ఓ మునీంద్ర రాజు, ఏఎస్ఐ దామోదర్ రెడ్డి, డిఎల్ఓ వెంకటేష్, సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, ఈవోపీఆర్డి సుకుమార్ రెడ్డి, పిహెచ్ఎన్ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్ఎస్ విజయలక్ష్మి లక్ష్మీపతి ఐసిడిఎస్ సూపర్వైజర్లు లలితమ్మ కవిత సరళ కుమారి సచివాలయం జిఎంఎస్, కేఎన్ఎమ్స్, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## రెవెన్యూ సదస్సుతోనే భూ సమస్యలు పరిష్కారం



**పెనుమూరు, మేజర్‌న్యూస్:** గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలు రెవెన్యూ సదస్సుతోనే పరిష్కారం అవుతాయని పెనుమూరు తహసిల్దార్ శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం పెనుమూరు మండలంలోని చింతపెంట గ్రామంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో గ్రామంలోని భూ సమస్యలపై 15 అర్జీలు అందాయని, అలాగే భూ రికార్డ్ పరిశీలనలో చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా ఓ రైతు పట్టా పాస్బుక్ సర్వే నంబర్ల సమస్యలకు పరిష్కారం చేయడం జరిగింది. చింతపెంట రెవెన్యూ పరిధిలోని భూ ఆక్రమణ పై కూడా ఉపయోగం ఉందని త్వరలోనే వాటిని పరిష్కారం చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో గుణ శేఖర్, మంజుల స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కిశోర బాలికల శిక్షణ కార్యక్రమం



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని ఎంపీడీవో కార్యా లయం నందు గురువారం కిషోర్ బాలికల శిక్షణ కార్య క్రమం ఐసిడిఎస్ శాఖ ఆధ్వ ర్యంలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. పిడి చందు రాణి మాట్లాడుతూ కిశోర బాలికలకు ఆరోగ్య సంరక్షణ చాలా అవసరమని, పౌష్టికాహారం సమతుల్య ఆహారం ఖచ్చితంగా తీసుకునే విధంగా అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులలచే పిఈటి శంకర్ యోగవల్ల ఉపయోగాలు ఆడపిల్లల స్వయ రక్షణ అంశాలపై విన్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ రాజేశ్వరి, ఎంఈఓలు చంద్రశేఖర్ రెడ్డి, రెడ్డెన్న శెట్టి, ఎస్ఐ లోకేష్, డాక్టర్ సల్మా బేగం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ మనోజ్ కుమార్ ఐసిడిఎస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో భారీ వర్షం... కమ్మపల్లి చెరువుకు స్వల్ప గండి

**వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే పులివర్తి నాని**

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** రామచంద్రపురం మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షాల వలన కమ్మపల్లి



చెరువుకు స్వల్పగండి పడడంతో అధికారులు హుటాహుటిన గండికి మరమ్మత్తులు చేపట్టారు. వరద ప్రభావిత ప్రాంతాలను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వరద ప్రభావిత ప్రాంతాలను పర్యాటించి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. నెన్నూరులో నక్కల వాగు సమీపంలో కొట్టుకుపోయిన ఆర్ అండ్ బి రోడ్డును పరిశీలించారు. అనంతరం కమ్మపల్లి చెరువు, రాయల చెరువులను పరిశీలించారు. పార కాలవ, దేసూరి కండ్రిగ, బ్రాహ్మణ కాలవ,గ్రామస్తులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరదలకు ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాయల చెరువు జల హారతి, తూములు , మొరవ పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల ఎమ్మార్వో వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరా, డిప్యూటీ తాసిల్దార్ అన్వర్ భాష, ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి చినబాబు, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు జనార్ధన్ చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, కొరహరి ప్రసాద్ నాయుడు, రావిళ్ళ గిరిబాబు, సురేంద్ర నాయుడు, మధుసూదన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, సునీల్‌యాదవ్ గిరిధర్ రెడ్డి, ముని రామిరెడ్డి, ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇద్దరు ఎర్రచందనం దొంగలు అరెస్టు

**10 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం**

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** అన్నమయ్య జిల్లా, రాయచోటి సమీపంలోని సుండుపల్లి-సానిపాయ మార్గంలో ఎర్ర చందనం అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్లును అరెస్టు చేసి,వారి నుంచి 10ఎర్రచందనం దుంగలు, ఒక కారును టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు



కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి.బాలిరెడ్డి మార్గనిర్దేశత్వంలో ఆర్ఐ (రిజర్వ్) కె.సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ ఎస్ఐ కేఎస్ కె.లింగాధర్ టీమ్ గురువారం ఉదయం సుండుపల్లి-సానిపాయ మార్గంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఒక వాహనం అతి వేగంగా వస్తూండగా టాస్క్ ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కారులో ఉన్న వ్యక్తులు దిగి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని అన్నమయ్య జిల్లా వాసులుగా గుర్తించారు.వారితో పాటు పట్టుబడిన 10 ఎర్రచందనం దుంగలు, కారును తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# చేసేది ప్రభుత్వ ఉద్యోగం నడిపేది యూట్యూబ్ ఛానల్

**నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం**
**ప్రభుత్వ నిబంధనలు పక్కన పెట్టేశారు**
**రాని నోటిఫికేషన్ వచ్చిందంటూ నిరుద్యోగుల ప్రాణాలతో చెలగాటం**
**అమాయకపు నిరుద్యోగులే ఆయన టార్గెట్**

**తిరుపతి, మేజర్‌న్యూస్:** కొండ సత్యనంద రెడ్డి ఈయనకు మరో పేరు కూడా ఉంది డీఎస్సీ సత్య ఈ పేరు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలియని వారు ఉండరు. కాంపిటీషన్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగ యువతే ఈయన ప్రధాన లక్ష్యంగామొత్తం వ్యవహారాన్ని నడుపుతున్నాడు. ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా తుంగలోకి తొక్కి చేసేది ప్రభుత్వ ఉద్యోగం నడిపేది యూట్యూబ్ ఛానల్. రెండు తెలుగు రాష్ట్రాలలో మెథడ్స్‌తో పాటుగా సబ్జెక్టు సీనియర్ ఫ్యాకల్టీగా ఆయన కొనసాగుతున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఆయన పని చేయని జిల్లా ఉండదు. విద్యా శాఖకు సంబంధించి చిన్న చిన్న అంశాలను సర్కుల ర్లను రాగానే వాటిపై తన సొంత ఛానల్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్




అందిస్తూ నిరుద్యోగులైన యువతను తప్పుదోవ పట్టిస్తున్నాడు. నా శిష్యులు ఎస్ఈఆర్‌టిలో ఉన్నారంటూ వారి నుంచి సమాచారం అక్రమంగా తీసుకోవడం వాటికి సంబంధించిన వివరణను తన యూట్యూబ్ ఛానల్‌లో యాప్‌ల ద్వారా తన వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా పెంచుకుంటూ తన ఆర్థిక బలోపేతాన్ని చేసుకుంటున్నాడు. దీనికి మాత్రం నిరుద్యోగులైన అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ వ్యవహారంలో కోచింగ్ సెంటర్లను కూడా వదలకుండా వారి నుంచి లక్షలకు లక్షలు అడ్వాన్సులను తీసుకుంటూ ప్రైవేటు వ్యాపారాన్ని నడుపుతున్నాడు. తను నడిపే ఆప్‌లో ఏకంగా ఈయన ఫోన్ నెంబర్ ఫోటోలతోనే బిల్లులు వస్తున్నాయి. తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ఏకంగా నేటికీ 420 వీడియోలను పెట్టాడంటే ఈయన ఏ విధంగా తన అక్రమ సంపాదనను కొనసాగిస్తున్నారో అర్థమవుతుంది. దీనిని అడ్డంగా పెట్టుకుని అవనిగడ్డ కోచింగ్ సెంటర్, తిరుపతి నారాయణ, కుట్టి, ఎస్ అండ్ ఎస్, బాసర వంటి అనేక ఆన్లైన్ కోచింగ్ సెంటర్లలో కమిషన్లకు పబ్లిసిటీ కూడా చేస్తున్నారు.

మహేష్ స్టడీస్ ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు

ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో జీకే ఫ్యాకల్టీగా వేషంవేసుకొని కోచింగ్ సెంటర్లలో తిరిగి తిరిగి అక్కడి విద్యార్థులను తీసుకొని కడపలో ప్రత్యేకంగా కోచింగ్ పెట్టాడు. ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్లకు సంబంధించిన ఎలాంటి సమాచారం లేకపోయినాఇప్పుడే అందిన తాజా సమాచారం అంటూ ఏకంగా నోటిఫికేషన్ విడుదలైన తేదీలు, పరీక్షల తేదీల పేరుతో అమాయకులైన నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాడు. ఏకంగా కాకి లెక్కలు చెప్పి మీరు ఇప్పుడు మేల్కొనకపోతే తీవ్రంగా నష్టపోతారంటూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నాడు. తన యూట్యూబ్ ఛానల్ లో ఏకంగా 1,84,000 మంది సబ్ స్క్రైబర్లు ఉన్నారు. దీంతో ఇప్పటివరకు 700 వీడియోలను పెట్టి పబ్లిసిటీ చేస్తున్నాడు. దీని ద్వారా కోట్ల బిజినెస్ ఎన్ని యాప్‌లు, ఎన్ని కోచింగ్ సెంటర్ల ద్వారా సంపాదిస్తున్నాడో ఇప్పుడే అర్థమవుతుంది. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ యువత డిమాండ్ చేస్తున్నారు.


Seerla Mahesh Dsc Coaching

# భారీ వర్షాల కారణంగా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంది

**జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు పూర్తిగా నిండి మిగులు నీరు లోలెవల్ కల్వర్టుల ద్వారా ప్రవహించే అవకాసం ఉన్నందున సమీప గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అదేశాలు జారీచేశారు, తుఫాన్ కారణంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన అత్యవసర చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోరకు డైల్ 112/80999 99977 నెంబర్లుకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలని విజ్ఞప్తి చేశారు. డ్యాంలు, వంకలు, వాగులు, చెరువుల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రమాదపు హెచ్చరిక సూచిక బోర్డులను ఏర్పాటు చేసి చర్యలు తీసుకు న్నారు, రహదారులపై భారీ వృక్షాలు నేలకొరిగి ట్రాఫిక్ అంతరాయం కలిగిన చోట వెంటనే వృక్షాలను తొలగించి ట్రాఫిక్ క్రమ బద్రీకరణ చేస్తున్నారు, అలాగే గండి పడిన చెరువులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేసి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారని జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, జిల్లా వ్యాప్తంగా వంకలు, వాగులు, వద్ద ముంపు గురైన ప్రాంతాలలో పోలీసులు పహారా కాస్తునారని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని తాజా సమాచారం తెలుసుకుని అవసరమైనప్పుడే బయట ప్రయాణం చేయాలని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ పోలీసుల సూచనలను పాటిస్తూ సురక్షితంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోరకు డైల్ 112/80999 99977 నెంబర్లుకు సమాచారం ఇస్తే పోలీస్ వారు తక్షణ సహాయకచర్యలు అందిస్తారని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ప్రజలకు సూచించారు. అండర్ బ్రిడ్జిల క్రింద నీళ్ళు ఎక్కువగా ఉన్నప్పుడు ఆ మార్గంలో వెళ్ళకూడదని, పాత భవనాలు, కృంగే స్వభావం ఉన్న నేల, ప్రదేశంలో నివాసాలు ఉన్నవారు కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున జాగ్రత పడాలని సూచించారు. మత్స్యకారులు వాతావరణ శాఖ హెచ్చరికలలను పాటించాలన్నారు.

**ఈ పనులు అస్సలు చేయొద్దు...** వరద నీళ్లలోకి వెళ్లకూడదని, ముఖ్యంగా ప్రవహించే నీళ్లకు పిల్లలను దూరంగా ఉంచాలని, వరద నీటిలో నడవకండి లేదా డ్రైవ్ చేయకండి, రెండు అడుగుల లోతున్న వరద నీటి ప్రవాహానికి పెద్ద కార్లు కూడా కొట్టుకుపోతాయన్నారు. వరదల సమయంలో, విద్యుత్తు అంతరాయాలకు అవకాశం ఉంటుంది కాబట్టి లిఫ్ట్‌కు బదులు మెట్లను ఉపయోగించాలని, సుదీర్ఘ విద్యుత్ అంతరాయాలు ఏర్పడినా, చుట్టూ నీళ్లు వచ్చేసినా లిఫ్ట్‌లలో చిక్కుకుని బయటకురాలేని పరిస్థితి ఏర్పడొచ్చన్నారు. మీరు తడిగా లేదా నీళ్లలో నిలబడి ఉంటే విద్యుత్ పరికరాలను తాకవద్దు. మురుగు కాలువలు, కల్వర్టులు మొదలైన వాటికి దగ్గరగా వెళ్లవద్దు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మకండన్నారు.



జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116



## ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్ :** పట్టణ రూరల్ పాస్టర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గూడూరు ముందస్తు క్రిస్మస్ గ్రాండ్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ హాజరు కాగా. ప్రసంగీకులుగా డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నిరంతరం పాస్టర్లకు మరియు సంఘ కాపరులకు అందుబాటులో ఉంటానని. వారికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. గూడూరు నియోజకవర్గంలో క్రిస్మస్ జరుపుకుంటున్నటువంటి క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రవీణ్ ప్రసంగిస్తూ లోక రక్షకుడైన యేసు ప్రభువు వారు పుట్టుకకు సంబంధించిన సువర్తమానము మొట్టమొదటిసారిగా అతి సామాన్యులైన గొర్రెల కాపరుల యొద్దకు దేవదూతలు వెళ్లి తెలపడం,అలాగే గొర్రెల కాపర్లు ఆసువార్త మానాన్ని లోకంలో చాటడం , ఒక్క గొర్రెల కాపరులకు మాత్రమే దక్కిన భాగ్యమని, అటువంటి భాగ్యం మనందరికీ కలగాలని తెలిపారు. అతిథులందరూ కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అందించారు దైవ సేవకులకు బహుమతి ప్రధానం చేశారు. 2025 వ సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ వి ప్రభుదాస్,ట్రెజర్ రత్న శేఖర్, చైర్మన్ డాక్టర్. కొర్నేలియస్, కార్యదర్శి డేవిడ్, దేవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడకు తరలివెళ్లిన మత్స్యకారులు

గూడూరురూరల్ మేజర్‌న్యూస్: స్వర్ణ ఆంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్ కార్యక్రమానికి తిరుపతి జిల్లా మత్స్యశాఖ అధికారి ఆదేశనుసారం విజయవాడ కి బయలుదేరి వెళ్లనున్న గూడూరు మరియు నాయుడుపేట కి చెందిన మత్స్యకారుల సహకార సంఘాల సభ్యులు..ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షత వహిస్తారు. ఈకార్యక్రమం డిసెంబర్ 13 తేది - 2024 ఇందిరాగాంధీ స్టేడియం, విజయవాడ లోజరుగునుంది. గూడూరు. నాయుడుపేట పట్టణానికి చెందినమత్స్యకార సహకార సంఘ సభ్యులు తరలి వెళ్లారు.



## కీల్కారి పై ఆశలకు అవగాహన ...

**యాదమరి, మేజర్ న్యూస్:** గర్భవతులు గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి ప్రభుత్వం వారికి ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇస్తుంది దీని గూర్చి ఆశలకు అవగా హన కార్యక్రమం చేపట్టారు. గురువారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఆశా కార్యకర్తల అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోనల్ ఇంచార్జ్ చెప్పే విషయాలను ప్రతి ఒక్కటి అర్థం చేసుకొని గర్భవతులకు దాని గూర్చి వివరించాలని సూచించారు. సమావేశాన్ని ఉద్దేశించి జోనల్ ఇంచార్జ్ కీర్తి మాట్లాడుతూ. ఒక వివాహిత గర్వం దాల్చిన నాటి నుండి అంతవరకు ఈ కీల్కారి సందేశం ఫలుదపాలు వారికి అందించాల్సి ఉంటుందన్నారు. అందువల్లనే గర్భవతిని నమోదు చేసే సమయంలో వారి మొబైల్ నెంబర్ మాత్రమే మీరు డేటాలో అప్డేట్ చేస్తే ఎలాంటి సమస్య రాకుండా గర్భవతికి అందించాల్సిన ప్రతి సమాచారం నేరుగా వారికి అందుతుందన్నారు. ఈ సమాచారంలో గర్భస్థ సమయంలో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై వారికి అర్థమయ్యేలా ఉంటుందని కనుక ప్రతి ఒక్క గర్భవతి ఈ సందేశాన్ని వినేలాగా ఆశా కార్యకర్తలు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సెల్వరాని ఉన్నారు.




## తుఫాను ప్రభావంతో రెవెన్యూ సదస్సుకు తగ్గిన ఫిర్యాదులు

**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** మండలంలోని పందిళ్ళ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సుకు డిప్యూటీ తహశీల్దార్ మాధవి హాజరైనారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా భూములకు,కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, సర్వే సంబంధించిన సమస్యలను పరిష్కరించే దిశలో ఒక నిర్దేశిత ప్రణాళికతో రెవెన్యూ సదస్సులను నిర్వహించడానికి షెడ్యూల్ తయారు చేశామని పేర్కొన్నారు. ఈ సదస్సుల సందర్భంగా సంబంధిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి ఫ్రీహోల్డ్ మరియు సెక్షన్ 22ఏ తదితర రెవెన్యూ సమస్యలను పరిష్కరించే దిశలో అధికార యంత్రాం గం గ్రమా స్థాయిలో అందుబాటులో ఉండి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సుల వేదిక రెవెన్యూ సంబంధిత సమస్యలు పరిష్కారానికి చక్కగా ఉపయోగపడు తుందని, రెవెన్యూ సదస్సు నిర్వహించే రోజున వచ్చే అర్జీలకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, రెవెన్యూ సదస్సుల సందర్భంగా స్వీకరించే ఫిర్యాదులన్నిటినీ రియల్ టైమ్ గవర్నెన్ సొసైటీ రూపొందించిన గ్రీవెన్స్ రిడ్రెసల్ పోర్టల్లోని ప్రత్యేక విండోలో ఆన్‌లైన్లో



నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామస్తులనుండి పిర్యాదులు స్వీకరించారు.మొత్తం 16 పిర్యాదులు అందాయని ఆవిడ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కదిరప్ప, స్థానిక తెలుగుదేశం నాయకులు వెంకట్రమణ రాజు, ప్రదీప్ రాజు రెవెన్యూ ఇన్స్పెక్టర్ భారతి, మండల సర్వేయర్ గుణశేఖర్, విఆర్ఓ లు మల్లికార్జున రెడ్డి, వెంకట్రమణ, రవినాయక్, విజయకుమార్ రెడ్డి, శ్రీజ, మంజుల, రెడ్డెప్ప, జ్యోతి, సుప్రియ, సుగుణమ్మ, యశోధ, సర్వేయర్లు, మణి, మోహన్ సిబ్బంది, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి పట్టణం ఆర్టీసీ బస్టాండ్ పరిశుభ్రంగా ఉండాలి : ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ అతిథి భవనం లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి ఆర్టీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు సుధీర్ రెడ్డి మాట్లాడుతూ బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు మెరుగైన వసతులు అందించాలని బస్సు సర్వీసులను పల్లెలకు మరిన్ని పెంచాలని ఆదేశించారు.



## కిషోర్ వికాసంపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో కిషోర్ వికాసంపై అంగన్వాడీ కార్యకర్తలకు వైద్య సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మ సునంద మా



ట్లాడుతూ కిషోర్ బాలికలు 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల పిల్లలు ఎటువంటి ఆహారం తీసుకోవాలి వివరించారు. అనంతరం సీఐ హనుమంతప్ప మాట్లాడుతూ బాల్య వివాహాలను గ్రామాల్లో జరుగుతుంటే వెంటనే సంబంధిత అధికారులకి సమాచార అందించాలన్నారు. మైనర్ బాలికలపై హత్యాచార చేస్తే వారిపై ఎటువంటి సెక్షన్లు ఉందని అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు. ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ మండలంలో 14 మంది బాల్య వివాహాలు చేసుకున్నారని, బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల వారికి కలిగే నష్టాలను వివరించారు. పిల్లల యొక్క నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలపై ప్రోత్సహిస్తే వెంటనే సంబంధాధికారులకు సమాచారా అందించాలన్నారు. బాలివాహాలపై మహిళా పోలీసులు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని అంగన్వాడి సూపర్వైజర్లు, ఇందిరా శ్యామిలీ, మండల విద్యాశాఖ అధికారులు విజయ్ కుమార్, మనోజ్ కుమార్, ఇన్చార్జ్ ఈవోపీఆర్డి నాగరత్నమ్మ , సిహెచ్ఓ రాజేశ్వరి, రిసోర్స్ పర్సన్ సెల్వి, అంగన్వాడీ కార్యకర్తలు సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

## యల్వీపురంలో ఆవు మృతి

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** మండలం నెత్తకుప్పం పంచాయతీ,యల్వాపురంలో నివసించు కామసాని మునిలక్ష్మి అనే మహిళా పాడి రైతులకు చెందిన ఆవు గురువారం సాయంత్రం చీకటి కోన వాగు పవ్రాహంలో కొట్టుకుని పోయి మృతి చెందినది. మేతకు తోలుకుని వెళ్లిన ఆవు భారీ వర్షంతో వుధృతంగా ప్రవహిస్తూవుండిన చీకటి కోన వాగు పవ్రాహంలో పడి కొట్టుకుపోయింది.



స్థానికులు ఈ విషయాన్ని చూసి దగ్గరగా అరవడంతో సమీపంలోని వారందరూ పరుగున వచ్చారు. వాగు నీటిలో దిగ లేక పక్కనే వెలుపల వైపున వెళ్లి చూడగా ఒక చోట చెట్లలో తగులుకుని వున్న ఆవు కనపడింది. తాళ్ల సహాయంతో ఒడ్డుకు లాగారు. అప్పటికే పాడి ఆవు మృతి చెందినట్లు తెలుసుకున్నారు. ఆవు గత 15 రోజులకు ముందు 1.18 లక్షలకు కొనినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తంచేశారు. అప్పులు చేసి ఆవును కొంటే ఈ విధంగా వరద నీటిలో కొట్టుకునిపోయి మృతి చెందిందని చెప్పారు.



## ఎర్రమరాజు పల్లి చెరువును పరిశీలించిన జల వనరుల శాఖ అధికారులు

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలో వర్షాలు ఎక్కువగా నమోదు కావడంతో జల వనరుల శాఖ అధికారులు కృష్ణా పురం జలాశయం ప్రక్కన ఉన్న ఎర్రమరాజు పల్లి చెరువును జల వనరుల శాఖ డి ఈ మురళి రాజు, ఏఈ రవి ప్రకాష్ తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణాపురం జలాశయంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటిమట్టం పెరగడంతో రాత్రి కూడా గేట్లు ద్వారా విడుదల చేయడం జరుగుతుందని, డ్యాం పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## అక్రమ లేఔట్‌లు మున్సిపాలిటీ పర్మిషన్ తీసుకోవాలి...లేకపోతే చట్టపరమైన చర్యలు

**- శ్రీకాళహస్తి మున్సిపాలిటీ కమిషనర్ బిఎస్ గిరి కుమార్**

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** పట్టణం మున్సిపాలిటీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు శ్రీకాళహస్తి పట్టణం శ్రీకాళహస్తి మున్సిపాలిటీ చట్టాలు. జీవోలు. టౌన్ ప్లానింగ్ ప్రకారం పర్మిషన్ తీసుకొని లేఔట్‌లు నిర్మించాలని శ్రీకాళహస్తి మున్సిపాలిటీ కమిషనర్ గిరి బిఎస్ గిరి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సూర్య దినపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణం మున్సిపాలిటీ పరిధి రాజీవ్ నగర్



జగనన్న గుడి ముందర ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ వేయడం జరిగింది. ఆ లేఔట్‌కు శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పర్మిషన్ తీసుకోలేదని. ప్రభుత్వ భూమిలో తారు రోడ్డు నిర్మించారని. ఆ లేఔట్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పట్టణం ప్లానింగ్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

# వర్షాలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండండి

**- లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** వరదల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయట రావద్దని, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. గురువారం నగరంలోని లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, ఆటోనగర్, పూలవాణి గుంట, లక్ష్మీపురం కూడలి, బాలాజి కాలని, డి.ఆర్.మహల్ రోడ్డు, అండర్ బ్రిడ్జి, కేశవాయన గుంట, నారాయణ పురం తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యవేక్షించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశామన్నారు. నగరంలో ఎక్కడా నీరు నిలవకుండా మురుగు కాలువల్లో జెసిబిల సాయంతో చెత్త తొలగిస్తున్నామని అన్నారు. నగరంలో అండర్ బ్రిడ్జి ల వద్ద నీరు నిలిస్తే తొలగించేందుకు మోటార్లు సిద్ధంగా ఉంచామని, పోలీసులు సహకారంతో బారికేడ్లను ఏర్పాటు చేశామని అన్నారు. ఎక్కడైనా చెట్లు కిందపడినా, కొమ్మలను తొలగించేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచామని అన్నారు. విద్యుత్ అంతరాయం రాకుండా తగు చర్యలు చేపట్టామని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లోనూ, ఇబ్బందులు పడే ప్రజల కోసం ప్రత్యేకంగా 17 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వర్షం అధికంగా ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం ఐతే తప్ప బయటకు రావొద్దని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే హెల్ప్ లైన్ నంబర్లను 08772256766, 9000822909 సంప్రదించాలని, తమ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని అన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఎస్పీ రామకృష్ణ ఆచారి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



# పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**- కమిషనర్ ఎన్.మౌర్య**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తుఫాన్ నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలోని వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ప్రజలను కోరారు. నగరంలోని 17 ప్రాంతాల్లో ఈ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 1. పోస్టల్ కాలనీ లోని పార్వతీపురం, నగరపాలక సంస్థ పాఠశాల. 2. మంగళం తుడా క్వార్టర్స్ వద్ద గల ఎంపిపి స్కూల్. 3. కొత్తపల్లి, ప్రైమరీ స్కూల్. 4. కోరమేను గుంట రాజీవ్ గాంధీ స్కూల్. 5. ఆర్.ఎస్. ఇంగ్లీష్ మీడియం స్కూల్. 6. మధురానగర్ లోని ఎం.సి.యు.పి. స్కూల్, 7. మధురానగర్ లోని ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం స్కూల్. 8. సంజయ్ గాంధీ కాలనీ లోని ఎం.యు.పి స్కూల్. 9. సత్యనారాయణ పురం లోని జడ్పీ స్కూల్. 10. కెనడి నగర్ లోని డి.అడిక్షన్ సెంటర్. 11. ఎర్రమిట్ట లోని రత్నం, చైతన్య స్కూల్. 12. సింగాలగుంట మునిసిపల్ స్కూల్. 13. ఉప్పంగి హరిజనవాడ మునిసిపల్ స్కూల్. 14. యశోదా నగర్ లోని లిటిల్ ఎంజిల్ స్కూల్. 15. బైరాగిపట్టెడ లోని రామానాయుడు స్కూల్. 16. ఎల్.బి.నగర్ లోని కేశవరెడ్డి స్కూల్. 17. వేశాలమ్మ గుడి వీధి లోని ఇందిరా నగర్ స్కూల్.

పైన తెలిపిన అన్ని కేంద్రాలకు ఇన్చార్జి అధికారులను నియమించామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడ్డా హెల్ప్ లైన్ నంబర్లు 0877 2256766, 9000822909 ను సంప్రదించాలని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు.

# నగరి నియోజకవర్గంలో భారీ వర్షం

**నగరి మేజర్‌న్యూస్:** నగరి నియోజకవర్గం లో తూఫాన్ కారణంగా తెల్ల వారి నుండి సాయంత్రం 5 గంటల వరకు నమోదైన వర్ష శాతం నగరి లో 52.4 మిల్లిమీటర్, నింద్ర మండలం లో 55.8 మిల్లిమీటర్, విజయపురం మండలం లో 40.4 మిల్లిమీటర్ వర్షం కురిసిందని తెలిపారు



# అభివృద్ధి ప్రదాత చంద్రబాబు నాయుడు

**- తెలుగుదేశం పార్టీ నేత రెడ్డి వారి గురవారెడ్డి**

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాలంలో రాష్ట్రంలో అన్ని వర్గాలు ప్రజలకు సంక్షేమానికి. అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రమాణ స్వీకారం చేసిన రోజే ఐదు ఫైలు మీద సంతకాలు పెట్టినటువంటి ఘనత నారా చంద్రబాబునాయుడుది అన్నారు. వృద్ధులు. వితంతువులు. వికలాంగులకు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికి పరిమితమైన వారికి పింఛన్ పెంపుదలలో భాగంగా వృద్ధులకు వితంతువులకు 4000 వికలాంగులకు 6000 కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 10,000 మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులకు 15 వేల రూపాయలు ఇచ్చి వాళ్ళు ఇళ్లల్లో ఒక పెద్ద బిడ్డగా ఉండి ఆదుకునేటటువంటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మహిళలు కోసం ఇచ్చిన మాట ప్రకారం సంవత్సరానికి 2700 కోట్ల రూపాయలతో మూడు గ్యాస్ సిలిండర్ ని ఉచితంగా ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. మహిళా



సంక్షేమ ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం అన్నారు. యువనేత మంత్రి నారా లోకేష్ దేశ విదేశాల్లో పలు రాష్ట్రాల్లో పారిశ్రామిక వేత్తలని ఒప్పించి మెప్పించి కొట్లాది రూపాయలు తెచ్చే విధంగా ప్రణాళిక రూపకల్పన చేసి లక్ష ఉద్యోగాలు కల్పనా భాగంగా పనిచేస్తున్నారని తెలిపారు. గతంలోనూ తెలుగుదేశం పార్టీ అధికారం ఉన్న రోజుల్లోనే 11 డిఎస్సీలను పెట్టి నిరుద్యోగ ఉపాధ్యాయులను లక్షలాది మందిని ఉపాధ్యాయులుగా తీసుకువచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వంది అన్నారు. మన భూములకు రక్షణగా ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ని రద్దుచేసి అదేవిధంగా ఎవరైనా భూములు అక్రమిస్తే వారిని చట్టబద్ధంగా శిక్షించే దాంట్లో భాగంగా ల్యాండ్ గ్రాఫింగ్ చట్టాన్ని తీసుకొచ్చిన ఘనత రైతుల పాలిట రైతు బాంధవుడుగా ముందుకు పోతున్న నాయకుడు నారా చంద్రబాబునాయుడు అన్నారు. గత రెండు రోజులుగా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్ని పెద్ద ఎత్తున చేయాలని చంద్రబాబు నాయుడు మనమంతా పత్రికల్లో మీడియాలో చూస్తున్నాం అటువంటి ముఖ్యమంత్రికి ఆశీర్వాదం ఇచ్చి ముందుకు నడిపించాలని ప్రజలంతా కోరుతున్నా మన్నారు. ఈ ఆరు నెలలు కాలంలో పెద్ద ఎత్తున సంక్షేమానికి అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఒకపక్క సంపద సృష్టించే దాంట్లో భాగంగా గత వైసిపి ప్రభుత్వం జగన్మోహన్రెడ్డి విధ్వంసకరపాలెంలో ప్రజావేదిక కూల్చి వేతతో ప్రారంభించిన టువంటి విధ్వంసం అమరావతిని అట్కెక్కించి పోలవరాన్ని పడకేయించి దయా ఫ్రమ్ వాళ్లను కూడా ఐదేళ్లలో కూల్ చేయడం జరిగింది. ప్రభుత్వాన్ దాంట్లో ముందుకు పోవడం హర్శించ అదేవిధంగా వెనుకబడిన రాయల సీమకి హైకోర్టు బెంచ్ ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఆ రూపంలో కర్నూల్ లో ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం అన్నారు.



# తిరుపతి అర్బన, రూరల్ ప్రాంతాల్లో ఏడతెరపని వాన...

**తిరుపతి రూరల్ మేజర్ న్యూస్:** తిరుపతి నగరంలో, రూరల్ ప్రాంతాల్లో గురువారం ఉదయం నుండి తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షాలు కురవడంతో నగరంలోని పలు కూడలిలో వర్షం నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ముఖ్యంగా ఉదయం నుండి వర్షం రావడంతో లక్ష్మీపురం సర్కిల్, చాపల మార్కెట్ ,బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాలలో రోడ్డుపైన సముద్రం లా నీరు రావడంతో రాకపోకలకు చాలా అంతరాయం కలిగింది. అదేవిధంగా డియర్ మహల్ , రాయల్ చెరువు రోడ్డు, వెస్ట్ చర్చ్ అండర్ బ్రిడ్జిల వద్ద ఎక్కువ నీరు నిలువ ఉండడంతో వాహనదారుల రాక పోకలను నిలిపివేయడం జరిగింది. కొన్నిచోట్ల భూ డ్రైనేజీ కాలవలు ఉబ్బి పైకి రావడంతో రోడ్డుపై నడవడానికి కూడా చాలా ఇబ్బందులు గురైనారు. తిరుపతి రూరల్ ప్రాంతంలో చిగురువాడ, తనపల్లి, నక్కల కాలనీలలో ఎక్కువ వర్షం కురవడంతో రోడ్లు కల్వర్టులు కోతలకు గురయినాయి. నగరపాలక సంస్థ వారు తుఫాన్ వల్ల కురుస్తున్న వర్షానికి నగరంలో 17 ప్రాంతాలలో పునరావస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే పోలీస్ సిబ్బంది జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు తుఫాను ప్రభావాన్ని పరివేక్షించారు. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షానికి అత్యవసరం గా విద్యార్థులకు గురువారం ఒక్కరోజు సెలవును ప్రభుత్వం ప్రకటించింది.



## వర్షానికి పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

### 20 గ్రామాలకు రాకపోకలు అంతరాయం



**ఎస్ఆర్ పురం మేజర్‌న్యూస్:** ఎస్ఆర్ పురం మండలంలో బుధవారం గురువారం కురిసిన వర్షానికి  చెరువులు, వాగులు , వంకలు పొంగి పొర్లుతున్న తున్నాయి. దీంతో దాదాపు 20 గ్రామాలకు రాకపోకలు కు అంతరాయం ఏర్పడింది. మండలంలోని పుల్లూరు పెద్ద చెరువు పద్మాపురం ఆర్ఆర్ పురం  పాతపాలెం జిఎంఆర్ పురం లలో చెరువులు నుండి మొరవ మీరు ఎక్కువ మొత్తంలో రావడంతో  పాపిరెడ్డి పల్లి ,పాతపాలెం, జిఎంఆర్ పురం, దిగువ కమ్మ కండిగ, ఎగువ కమ్మకండిగా వాగుల్లో ఉధృతంగా నీరు ప్రవహిస్తున్నాయి. వాగును పరిశీలించిన తహసిల్దార్ లోకనాథ్ పిళ్ళై  సెలవుల రోజుల్లో పిల్లలను విద్యార్థులు  చెరువులు వంకలు, వాగులు దగ్గరికి వెళ్ళకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలనిఅన్నారు. మండలంలోని పాతపాలెం వాగు ఉధృతంగా ప్రవహించడంతో పిల్లలు, మహిళను గ్రామస్తులు రోడ్డు దాటించారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సు




**శాంతిపురం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని సొగడబల్ల రెవెన్యూ గ్రామ పరిధిలో శాంతిపురం మండల తహశీల్దారు జి.శివయ్య ఆధ్వర్యంలోగురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో భూ సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు.రైతులు ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా భూమికి సంబంధించిన ముటేషన్,రీ సర్వే 22ఎ,ఆర్ ఓ ఆర్ ల్యాండ్ గ్రాబింగ్, ఫ్రీ హోల్డ్ అసైన్మెంట్ మొదలైన సమస్యలపై ఎలాంటి సమస్యలు ఉన్న అర్జీ రూపంలో తెలిపితే తక్షణం పరిష్కారం చూపుతామని తెలిపారు.అనంతరం ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సదస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచ్ మాజీ ఎమ్ పి టి సి సభ్యుడు గంట్లప్ప మాజీ సర్పంచ్ గోపాల్ టీ డి పి అధ్యక్షుడు మంజునాథ్ సలావాద్ వెంకటేష్ బాపు సాబ్ బాలప్ప కృష్ణప్ప మునిరత్నం శేఖర్ బానా ఉమాపతి మహబూబ్ ఈశ్వరమ్మ గ్రామ సచివాలయ సిబ్బంది, ఆర్ ఐ శ్రీనివాసులు విఆర్ఓ చంగల్ రాయుడు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

**శాంతిపురం మేజర్ న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం శాంతిపురం ఎంపిడిఒ కుమార్ అధ్యక్షతన డ్వామా ఏపీడీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మండలంలో 2023-24 గానూ ఉపాధి హామీ చట్టంతో పాటు పలు సంక్షేమ పథకాల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులు నిర్వహించిన పనులపై తనిఖీ బృందం క్షేత్రస్థాయి పనులపై మండలస్థాయిలో ప్రజా వేదిక సభ నిర్వహించి సామాజిక తనిఖీపై పంచాయతీల వారీగా నివేదికలను ప్రజాప్రతినిధుల సమక్షంలో చదివి వినిపించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1384 వివిధ రకాల పనులుగాను రూ.6.78 కోట్లు ఖర్చు చేశారు. సామాజిక





తనిఖీ సిబ్బంది గుర్తించిన అంశాలలో మామిడి మొక్కలు చనిపోయిన వివరాలు తెలియజేసి రైతులకు నాటుకోవాలని చెప్పారు. అదనంగా చెల్లించినటువంటి వేతనాలు,ఒక పనికి అదనంగా మెటీరియల్ డబ్బులను తిరిగి రికవరీ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. చిన్నారిదొడ్డి దొడ్డి పంచాయతీలో 183323 రూపాయలు, కర్లగట్ట పంచాయతీలో 140494 రూపాయలు, నడింపల్లి పంచాయతీలో 97 వేల రూపాయలు, మఠం పంచాయతీలో 89 వేల రూపాయలు, మఠం పంచాయతీలో 58 వేల రూపాయలు ఇలా 23 పంచాయతీలలో మొత్తంగా 880311 రూపాయలు రికవరీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో హరి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది రైతులు ఉపాధి కూలీలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అరణీయార్ ప్రాజెక్ట్‌కు జలకళ

**పిచ్చాటూర్, మేజర్‌న్యూస్:** సత్యవేడు నియోజకవర్గంలోని పిచ్చాటూరు అరణీయార్ జలాశయం పూర్తి స్థాయి లో నిండిపోయింది  నీటిమట్టం 31 అడుగులు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 1.85 టీఎంసీ చేరుకుంది.ఇదే సమయంలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు జలాశయం పై నుండి అరుణా నది ద్వారా 5400 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.ఈ క్రమంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై 5600 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు స్పిల్ వే గేట్ల ద్వారా బయటకు పంపుతున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడం తో ప్రాజెక్టు నుంచి నీరు వదలడంతో దిగువన ఉన్న అరుణా నది ఉధ్రుతంగా ప్రవహించి ఎదురుగా ఉన్న పిచ్చా టూరు – శ్రీ కాళహస్తి కాజ్ వే పైకి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో పిచ్చాటూరు – శ్రీ కాళహస్తి మధ్య రాకపోకలు స్తంభించాయి పోలీసులు అప్రమత్తమై కాజ్ ఇరువైపులా పహారా కాస్తూ ఎవరూ దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరిస్తున్నారు. రాత్రికి వరద నీరు మరింత ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, గేట్ల ద్వారా కూడా మరిన్ని నీరు కిందకి విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరూ అరుణానదిని దాటే ప్రయత్నం చేయవద్దని, నది పరివాహక గ్రామాల్లో రెవిన్యూ అధికారులను, సచివాలయం ఉద్యోగులను కాపలా పెట్టారు.అరణీయార్ జలాశయం వరుసగా 6 సార్లు పూర్తి స్థాయిలో నిండడం పట్ల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

